


'పాతవారికే పట్టం'పై మంత్రి పేషీ ఆరా

విశాఖపట్నం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర యూనివర్సిటీలో కీలక స్థానాల భర్తీపై 'పాతవారికే పట్టం' శీర్షికన మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై మంత్రి నారా లోకేష్ పేషీ ఆరా తీసినట్టు తెలిసింది. మంత్రి ఆదేశాలు లేకుండా నియమించిన ఒకటి, రెండు పదవుల గురించి, ఆయా పోస్టుల్లో నియమితులైన వారి గురించి వర్సిటీ ఉన్నతాధికారులను ప్రశ్నించినట్టు తెలిసింది. కొత్తగా నియమితులైన వారి వివరాలను మంత్రి పేషీ అధికారులు తెప్పించుకున్నట్టు తెలిసింది. దీనిపై వర్సిటీ అధికారులు మాత్రం మాట్లాడడం లేదు.



మంత్రి నారా లోకేశ్‌కు విమానాశ్రయంలో స్వాగతం పలుకుతున్న పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు. చిత్రంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు ఉన్నారు

లోకేశ్‌కు ఘన స్వాగతం

- ఎయిర్‌పోర్టుకు భారీగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు
- కార్యాలయంలో రాత్రికి బస

గోపాలపట్నం/మహారాణిపేట, ఆగస్టు 28: రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ బుధవారం రాత్రి నగరానికి చేరుకున్నారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారి విశాఖ విచ్చేసిన ఆయనకు విమానాశ్రయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, పి.గణబాబు, బండారు సత్యనారాయణమూర్తి, కేఎస్ఎన్ఎస్ రాజు, ఎమ్మెల్సీలు దువ్వారపు రామారావు, వేపాడ చిరంజీవిరావు, విశాఖపట్నం, అనకాపల్లి పార్లమెంటరీ నియోజకవర్గాల పార్టీ అధ్యక్షులు గండి బాబ్జీ, బత్తుల తాతయ్యబాబు, పార్టీ నాయకులు కిడారి శ్రావణ్‌కుమార్, బుద్ధా నాగజగదీష్, దాడి రత్నాకర్, ప్రగడ నాగేశ్వరరావు, సీతంరాజు సుధాకర్, పీలా శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర్ ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్, విశాఖపట్నం ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, గోపాలపట్నం తహసీల్దార్ రమేష్, తదితరులు పుష్ప గుచ్ఛాలతో స్వాగతం పలికారు.

కార్యకర్తలతో ఫొటోలు

ఎయిర్‌పోర్టులో లోకేశ్‌తో మాట్లాడి ఫొటోలు దిగేందుకు ఎక్కువమంది వచ్చారు. అయితే భద్రతా కారణాలతో సిబ్బంది వారిని దూరంగా ఉంచారు. ఇది చూసిన లోకేశ్ స్పందిస్తూ...వారిని వదిలేయండి...నేనే మేనేజ్ చేస్తానన్నారు. అప్పుడు భద్రతా సిబ్బంది అందరిని లోకేశ్ వద్దకు అనుమతించడంతో వారందరితో ఫొటోలు దిగారు.

పార్టీ కార్యాలయంలో బస

ఎయిర్‌పోర్టు నుంచి నేరుగా లోకేశ్ సెవెన్‌హిల్స్ ఆస్పత్రి వెనుక ఉన్న జిల్లా పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. ఆయనతోపాటు పల్లా శ్రీనివాసరావు, శ్రీభరత్, గండి బాబ్జీ తదితరులు ఉన్నారు. కార్యాలయం వద్ద తెలుగు మహిళలు కేదారి లక్ష్మి, గణగళ్ల సత్య తదితరులు హారతి ఇచ్చి స్వాగతం పలికారు. పార్టీ కార్యాలయం ఆవరణలో గల బస్సులో ఆయన రాత్రి బస చేశారు.



నగరంలోని పార్టీ కార్యాలయం వద్ద మంత్రి నారా లోకేశ్‌కు స్వాగతం పలుకుతున్న తెలుగు మహిళలు. చిత్రంలో ఎంపీ ఎం.శ్రీభరత్, పల్లా శ్రీనివాసరావు ఉన్నారు

ఏయూలో అక్రమాల నిగ్గుతేలేనా?

మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేశ్ సందర్శన రేపు

- గత వీసీ ప్రసాదరెడ్డి హయాంలో అడ్డగోలు నిర్ణయాలు
- నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు
- అస్మదీయులకు పదవుల పందేరం
- నిధుల దుర్వినియోగం
- అనేక కోర్సులు ఎత్తివేత...గెస్ట్ ఫ్యాకల్టీ తీసివేత
- విచారణకు ఆదేశిస్తారా?...అందరిలోనూ ఆసక్తి



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేష్ ఈ నెల 30వ తేదీన ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని సందర్శించనున్నారు. ప్రతిపక్షంలో ఉండగా ఆయన వర్సిటీలో అవకతవకలపైనా, గత పాలకుల విధానాలపైనా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అప్పటి వీసీ ప్రసాదరెడ్డి సంస్థానంలా భావించి అడ్డగోలు కార్యకలాపాలకు వేదికగా మార్చారంటూ విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే వర్సిటీని ప్రక్షాళన చేయడంతోపాటు ప్రసాదరెడ్డి అక్రమాలపై విచారణ జరిపిస్తామని అప్పట్లో ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఆయన పర్యటనపై వర్సిటీలో సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఏయూలో జరిగిన వ్యవహారాలపై విచారణకు ఆదేశిస్తారా?, లేదా?... అని ఎదురుచూస్తున్న వర్సిటీ ఉద్యోగులు, సిబ్బందికి మంత్రి పర్యటనలో తగిన స్పష్టత లభిస్తుందని భావిస్తున్నారు.

అక్రమాలకు అడ్డాగా మార్చిన గత పాలకులు..

యూనివర్సిటీలో గడిచిన ఐదేళ్లలో అనేక అక్రమాలు చోటు చేసుకున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. నాటి వీసీ ప్రసాద రెడ్డి...తనకు ఇష్టం వచ్చినట్టు వ్యవహరిస్తూ వచ్చారు. నిబంధనలు పట్టించుకోకుండా, చట్టాలను ఉల్లంఘిస్తూ అనేక నిర్ణయాలు తీసుకున్నారు. అడ్డగోలుగా నియామకాలు చేపట్టడంతోపాటు అస్మదీయులకు పదవులు పందేరం చేశారు. ప్రొఫెసర్ కృష్ణమోహన్‌కు నిబంధనలకు విరుద్ధంగా మూడు సార్లు రిజిస్ట్రార్‌గా అవకాశం కల్పించారు. ఆ తరువాత కూడా ఓఎస్‌డీ పేరుతో పోస్టు సృష్టించి, ఆ బాధ్యతలను అప్పగించారు. అదేవిధంగా వర్సిటీలో పూర్తిస్థాయి ఉద్యోగి కాక పోయినా స్టీఫెన్‌ను రిజిస్ట్రార్‌గా నియమించారు. ఈ విధంగా తనకు కావాల్సిన ఎంతో మందిని అడ్జంక్ట్ ప్రొఫెసర్లు, చైర్ ప్రొఫెసర్లు, ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్‌లుగా నియమించుకున్నారు. పదవీ విరమణ చేసిన వారిని కీలక విభాగాలకు అధిపతులుగా, డీన్లుగా నియమించారు. రాష్ట్రంలో మరే వర్సిటీలో లేనివిధంగా ఎయిడెడ్ ఫ్యాకల్టీని తీసుకున్నారు. ఏళ్ల తరబడి కొనసాగుతున్న అనేక కోర్సులను అడ్మిషన్లు తగ్గాయని కారణాన్ని చూపించి ఎత్తేశారు. కోర్సులతోపాటు ఆయా విభాగాల్లో పనిచేసే గెస్ట్ ఫ్యాకల్టీని కూడా నిర్దాక్షిణ్యంగా రోడ్డున పడేశారు. ఈ వ్యవహారాలన్నింటినీ మంత్రి లోకేష్ దృష్టికి ... మిగతా 6వ పేజీలో

ఐటీ అభివృద్ధిపై ఆశలు

గత ఐదేళ్లుగా నిర్లక్ష్యం చేసిన వైసీపీ ప్రభుత్వం

- రాయితీలు లేవు, బకాయిలూ విడుదల చేయలేదు
- రుషికొండ ఐటీ పార్కులో ఖాళీగా భవనాలు
- కూటమి ప్రభుత్వం రాకతో పరిశ్రమ వర్గాల్లో ఉత్సాహం
- యువనేత, ఐటీ మంత్రి నారా లోకేశ్‌పై గంపెడాశలు



మిలీనియం టవర్స్‌ను ప్రారంభిస్తున్న నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, చిత్రంలో మంత్రి లోకేశ్ తదితరులు (ఫైల్ ఫొటో)

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో విశాఖపట్నానికి ఐటీ హబ్‌గా పేరుంది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో హైదరాబాద్ తరువాత ఇక్కడే యువతకు ఎక్కువ ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. అయితే వైసీపీ ప్రభుత్వం ఐటీని నిర్లక్ష్యం చేసింది. కంపెనీలకు రాయితీలు ఇవ్వలేదు. బకాయిలు కూడా విడుదల చేయలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రావడంతో ఐటీ వర్గాల్లో ఆశలు చిగురించాయి. ఐటీ శాఖా మంత్రి లోకేశ్‌కు విశాఖపై ప్రత్యేక అభిమానం ఉండడంతో అభివృద్ధికి బాటలు వేస్తారని ఆశిస్తున్నారు. ఆయన నగర పర్యటన నేపథ్యంలో ఐటీ రంగ స్థితిగతులపై అందిస్తున్న కథనం...

విశాఖను 'సిలికాన్ ఆఫ్ ఆంధ్రా'గా మారుస్తామని చంద్రబాబునాయుడు అనేకసార్లు ప్రకటించారు. 2014-19 మధ్య రుషికొండలో ఫిన్‌టెక్ హబ్ ఏర్పాటుచేశారు. స్టార్టప్‌లను ప్రోత్సహించడానికి ఏపీ సన్‌రైజ్ స్టార్టప్ సెంటర్ ప్రారంభించారు. ఐటీ కంపెనీలకు ప్లగ్ అండ్ ప్లే సౌకర్యంతో వసతి కల్పించడానికి మిలీనియం టవర్-1ని ఏర్పాటుచేసి, అందులో కాండ్యుయెంట్ సంస్థను ప్రారంభించారు. అప్పటి ఐటీ శాఖా మంత్రిగా లోకేశ్ కూడా విశాఖలో మరిన్ని ఐటీ కంపెనీలకు అవకాశం కల్పించాలని కాపులుప్పాడలో ఓ కొండపై 250 ఎకరాలలో రూ.40 కోట్ల వ్యయంతో ప్రత్యేకంగా లేఅవుట్ వేయించారు. అయితే ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం దానిని ఎలా దిగమింగాలో అర్థం కాక అలాగే వదిలేసింది. గత రెండేళ్లు ఐటీ శాఖా మంత్రిగా విశాఖకు చెందిన గుడివాడ అమర్‌నాథే ఉన్నా ఐటీ అభివృద్ధికి ఎటువంటి చర్యలు చేపట్టలేదు. ఇన్ఫోసిస్ కంపెనీ తన సొంత అవసరాల కోసం ఇక్కడ కార్యాలయం ఏర్పాటుచేసుకుంటే దానిని తామే తీసుకువచ్చామని ప్రచారం చేసుకున్నారు.

రుషికొండ ఐటీ పార్కులోని మిలీనియం టవర్-1లో నాలుగు అంతస్తులను ఐదేళ్లుగా ఖాళీగా ఉంచారు. పక్కనే నిర్మించిన టవర్-2ను కూడా ఖాళీగా వదిలేశారు. ఆ రెండింటిలో సుమారుగా 3 లక్షల చ.అ. విస్తీర్ణం అందుబాటులో ఉంది. చిన్న ప్రకటన ఇస్తే పదుల సంఖ్యలో ఐటీ కంపెనీలు ముందుకు వస్తాయి. వేలాది మందికి ఉపాధి లభిస్తుంది.

- రుషికొండ హిల్ నంబరు 2,3లలో అనేక భవనాలు ఖాళీగా ఉన్నాయి. గతంలో టీడీపీ ప్రభుత్వం కొత్త కంపెనీలు ఏర్పాటుచేస్తే వాటి అద్దెలో 50 శాతం తానే భరించేది. ఈ పథకానికి మంచి ఆదరణ లభించింది. అనేక కంపెనీలు వచ్చాయి. ఇప్పుడు మళ్లీ ఆ పథకం పెట్టాలనే డిమాండ్ వినిపిస్తోంది.
- వైసీపీ హయాంలో ప్రకటించిన రాయితీలు, ప్రోత్సాహకాలు ఏమీ ఇవ్వలేదు. సుమారు రూ.180 కోట్ల వరకు బకాయిలు ఉన్నాయి. ప్రభుత్వ పథకాలను విశ్వసించి ముందుకు వచ్చిన కంపెనీలు మోసపోయాయి. కూటమి ప్రభుత్వంలో అలాంటివి జరగకుండా బకాయిలు ఇవ్వడంతోపాటు ఆకర్షణీయమైన కొత్త పాలసీని పెట్టాల్సి ఉంది.
- మధురవాడలో అదానీ డేటా సెంటర్‌కు ఏడాదిన్నర క్రితం శంకుస్థాపన చేశారు. ఇప్పటికీ అక్కడ పనులు ప్రారంభం కాలేదు. వందల ఎకరాలు కేటాయించారు. వేలాది ఉద్యోగాలు ... మిగతా 6వ పేజీలో

4న జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం

- 280 అంశాలతో ఎజెండా
- వివాదాస్పదమైన వాటికి స్థానం

విశాఖపట్నం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం వచ్చే నెల నాలుగో తేదీన నిర్వహించనున్నట్టు కమిషనర్ పి.సంపత్‌కుమార్ తెలిపారు. ఈ సమావేశం కోసం 280 అంశాలతో ఎజెండా తయారుచేసి సభ్యులకు అందజేశారు. వాస్తవంగా బుధవారమే స్టాండింగ్ కమిటీ సమావేశం జరపాలని నిర్ణయించినప్పటికీ అనివార్య కారణాలతో వచ్చే నెల నాలుగుకు వాయిదా వేశారు. గత ఐదు నెలలుగా స్టాండింగ్ కమిటీ సమావేశం జరగకపోవడంతో గతంలో ఎన్నడూలేనివిధంగా 280 అంశాలను ఎజెండాలో చేర్చారు. ఎంఎస్ఎఫ్‌లలోని క్లోజ్డ్ కాంపాక్టర్ సిస్టమ్ (సీసీఎస్) నిర్వహణ కాంట్రాక్టు గడువు ఈ ఏడాది మార్చితో ముగిసింది. అదేసంస్థకు తిరిగి నామినేషన్‌పై నిర్వహణ పనులు అప్పగించాలని ప్రతిపాదించడం అనుమానాలకు తావిస్తోంది. అలాగే రోడ్లపై తిరిగే పశువులను పట్టుకుని యజమానులకు జరిమానా విధించేందుకు వీలుగా రెండు వాహనాలను సమకూర్చేందుకు ఏడాదికి రూ.32.4 లక్షలు వెచ్చించడానికి అనుమతి కోరడం విశేషం. అదేవిధంగా అవుట్‌సోర్సింగ్ కార్మికులు అనారోగ్యం కారణంగా విధులకు హాజరుకాలేకపోతే వారి కుటుంబసభ్యులను విధుల్లోకి అనుమతించే ప్రతిపాదనను ఎజెండాలో చేర్చడంపై విమర్శలు వినిపిస్తు న్నాయి. నగరంలో వార్డు సచివాలయానికి ఒకటి చొప్పున క్లాప్ వాహనాలు ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరిస్తుండగా ఐదు, ఆరు, ఏడు వార్డుల్లో రెండు నెలలపాటు చెత్తసేకరణకు మూడు వాహనాలను వినియోగించామని, వాటికి రూ.4.86 లక్షలు చెల్లించేందుకు అనుమతించాలని ఎజెండాలో పేర్కొనడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. జోన్-2 పరిధిలోని చెట్ల వ్యర్థాలను కాపులుప్పాడలోని యార్డుకు తరలించేందుకు ఒక టాటా ఏస్ వాహనాన్ని 90 రోజులు అద్దెకు తీసుకున్నామని, దానికి రోజుకి రూ.5,500 చొప్పున రూ.4.95 లక్షలు చెల్లించేందుకు అనుమతి కోరారు.

బదిలీల కోసం...

ప్రజా ప్రతినిధులతో సిఫారసులు, ఫోన్లు

- దరఖాస్తుల స్వీకరణకు 24వ తేదీతో ముగిసిన గడువు
- వరుస సెలవులు వచ్చాయనే ఉద్దేశంతో ఇంకా స్వీకరణ
- ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన నిర్వహణ
- ఎంపీడీవో పోస్టుల కోసం పలువురు పైరవీలు
- జిల్లాలో ఒకరిద్దరు తహసీల్దార్లకు స్థాన చలనం
- పౌరసరఫరాల శాఖలో చెకింగ్ ఇన్‌స్పెక్టర్ల పోస్టులకు పోటీ



విశాఖపట్నం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి):

ప్రభుత్వ శాఖల్లో బదిలీల హడావిడి మొదలైంది. కొత్త ప్రభుత్వం పగ్గాలు చేపట్టిన తరువాత తొలిసారి జరిగే బదిలీల్లో రాజకీయ జోక్యం ఎక్కువగా ఉంటుందనేది బహిరంగ రహస్యం. ప్రస్తుతం బదిలీ కోరుకునే అధికారులు, ఉద్యోగులు కూడా తమకు తెలిసిన వారి ద్వారా సిఫారసు చేయించుకునేందుకు యత్నిస్తున్నారు. ఈ క్రమంలో మంత్రులు/ఎంపీలు/ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కొందరైతే ఒకరి సిఫారసు లేఖతో సంతృప్తిచెందకుండా తమకున్న పలుకుబడి ఉపయోగించి ఇద్దరు, ముగ్గురు ఎమ్మెల్యేల నుంచి లేఖలు సంపాదిస్తున్నారు. ఆ లేఖలను సంబంధిత అధికారులకు సమర్పించడంతోపాటు అవి ఇచ్చిన ప్రజా ప్రతినిధులతో ఫోన్లు చేయించుకుంటున్నారు. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికగా బదిలీలు జరగనున్నందున ఏజెన్సీ, మైదానం నుంచి ఎక్కువ మంది నగర పరిసరాల్లో పోస్టింగ్స్‌కు యత్నిస్తున్నారు.

ఒకేచోట ఐదేళ్లు సర్వీస్ పూర్తిచేసుకున్న అధికారి/ఉద్యోగికి బదిలీ తప్పనిసరి. అయితే సర్వీస్‌తో నిమిత్తం లేకుండా బదిలీల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇందుకు ఈనెల 24వ తేదీతో గడువు ముగిసినా వరుస సెలవుల కారణంగా దరఖాస్తులు ఇంకా స్వీకరిస్తున్నారు. ఈ నెలాఖరులోగా బదిలీలు చేయాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, గ్రామీణ నీటి సరఫరా విభాగంలో మంగళవారం అర్ధరాత్రి వరకు బదిలీలు నిర్వహించారు.

ఎంపీడీవో పోస్టులకు పైరవీ..

ఉమ్మడి జిల్లాలోని 39 మండలాల్లో ఐదేళ్లు సర్వీస్ పూర్తిచేసుకున్న ఎంపీడీవోలు ఆరేడుగురు మాత్రమే ఉన్నారు. ఐదేళ్ల సర్వీస్ పూర్తికాకపోయినా పలువురు ఎంపీడీవోలు కీలక మండలాల్లో పోస్టింగ్‌కు యత్నిస్తున్నారు. దీనికి ప్రజాప్రతినిధుల నుంచి లేఖలు తెచ్చుకున్నారు. ప్రజా ప్రతినిధులు కూడా స్వయంగా రంగంలోకి దిగి తమకు అనుకూలంగా ఉండే ఎంపీడీవో నియామకం కోసం పట్టుపడుతున్నారు. అయితే జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆధ్వర్యంలోని కమిటీయే ఎంపీడీవోల నుంచి కిందిస్థాయి ఉద్యోగి వరకు బదిలీలు చేపట్టాలి. బదిలీల కోసం సుమారు 160 వరకు దరఖాస్తులు వచ్చాయని చెబుతున్నారు.

జిల్లాలో ఒకరిద్దరు తహసీల్దార్లకు స్థాన చలనం

రెవెన్యూ శాఖలో బదిలీల కోసం ఉమ్మడి విశాఖ జిల్లాలో 70 నుంచి 80 మంది దరఖాస్తు చేశారని తెలిసింది. అల్లూరి సీతారామరాజు ... మిగతా 6వ పేజీలో

3 నెలల్లో ఉక్కును గాడిలో పెడతా

రూ.7,500 కోట్లు వర్కింగ్ కేపిటల్ అవసరం

- ఇది కష్టకాలం...అందరూ కలిసి పనిచేయాలి : సీఎండీ అతుల్ భట్



సమావేశంలో మాట్లాడుతున్న సీఎండీ అతుల్‌భట్. ఇతర అధికారులు

విశాఖపట్నం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు కర్మాగారాన్ని రాబోయే మూడు నెలల్లో ట్రాక్‌లో పెడతానని సీఎండీ అతుల్ భట్ హామీ ఇచ్చారు. ప్లాంటులో కార్మిక సంఘాలతో బుధవారం సుమారు మూడు గంటలసేపు సమావేశం నిర్వహించి తాజా పరిస్థితిపై చర్చించారు. తన పదవీ కాలం ఇంకా మూడు నెలలే ఉందని, ఈలోగా సమస్యలన్నీ పరిష్కరిస్తానన్నారు. ప్లాంటును 100 శాతం సామర్థ్యంతో నడిపించాలంటే రూ.7,500 కోట్లు వర్కింగ్ కేపిటల్ (నిర్వహణ మూలధనం) అవసరమని, దానిని సమకూర్చుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఇది కష్టకాలమని, కార్మిక సంఘాలు, అధికారులు యాజమాన్యంతో కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఉత్పత్తి తగ్గడంలో ఎవరి తప్పు లేదని, ముడి పదార్థాల కొరతే కారణమన్నారు. గురువారం నుంచి ప్రతి రోజు ఐదు ర్యాక్‌లతో ఐరన్ ఓర్ పంపించడానికి ఎన్ఎండీసీ అంగీకరించిందన్నారు. ఎక్కువ ఉత్పత్తి చేస్తే తప్ప ఉత్పత్తి వ్యయం ... మిగతా 6వ పేజీలో



మునిసిపల్ స్టేడియం వద్ద రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

జోరు వాన

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- గాలులకు నేలకొరిగిన చెట్లు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం
- గంభీరంలో 5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు

విశాఖపట్నం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): సుమారు నాలుగు వారాల తరువాత నగరంలో భారీవర్షం కురిసింది. బుధవారం ఉదయం నుంచి ఎండ తీవ్రత, ఉక్కపోత కొనసాగగా, సాయంత్రం ఆరు గంటలకు ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఈదురుగాలులతో వర్షం మొదలైంది. గాలులకు పలుచోట్ల చెట్ల కొమ్మలు తెగిపడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రాత్రి 11 గంటల తరువాత పునరుద్ధరించారు. కాగా జోరు వర్షానికి నగరంలో లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. పూర్ణామార్కెట్, రామకృష్ణా జంక్షన్ ... మిగతా 6వ పేజీలో



పూర్ణామార్కెట్ వద్ద పందుం పుల్లల సందులో నిలిచిన వర్షపు నీరు

సత్యనారాయణస్వామి ఆలయ ఘాట్ రోడ్డు వద్ద ప్రసాదాల కౌంటర్లు



ప్రసాదాల కౌంటర్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

పూర్ణామార్కెట్, ఆగస్టు 28: ఇసుక కొండ సత్యనారాయణ స్వామి ఆలయం అధికారులు పూర్ణామార్కెట్ మెయిన్ రోడ్డు ఘాట్ రోడ్డు ప్రధాన ద్వారం వద్ద రెండు ప్రసాదాల కౌంటర్లను భక్తుల కోసం ఏర్పాటు చేశారు. బుధవారం ఉదయం ఈ కౌంటర్లను దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్నవరం దేవస్థానంలో తరహాలో ఇక్కడి ఘాట్ రోడ్డు ముఖద్వారం వద్ద ప్రసాదాల కౌంటర్లు ఏర్పాటు చేయడం భక్తులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, నాయకులు, ఆలయ అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ధర్నాలో సీఐటీయూ నాయకులు, కార్మికులు

విశాఖపట్నం, ఆగస్టు 28: కాంట్రాక్టు కార్మికులకు జీతాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ నాయకులు బుధవారం డీఆర్ఎం కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రైల్వే యూనియన్ సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి. శ్రీనివాసరావు మాట్లాడుతూ, రైల్వేలోని ఓబీహెచ్ఎస్‌లో పనిచేసిన కాంట్రాక్టు కార్మికులకు గత ఏడాదికి చెందిన నాలుగు నెలల జీతాలను సౌముక్ కంపెనీయాజమాన్యం చెల్లించకుండా పారిపోయిందన్నారు. రైల్వే అధికారులు స్పందించి చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.



మంత్రి లోకేశ్‌కు నేతల ఘన స్వాగతం






నాలుగు రోజుల పర్యటన సందర్భంగా బుధవారం రాత్రి విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న ఐటీ, విద్యా శాఖా మంత్రి నారా లోకేశ్‌కు స్వాగతం పలుకుతున్న పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, విశాఖ దక్షిణ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్

పంజరంలో పక్షి పుస్తకం ఆవిష్కరణ



పుస్తకావిష్కరణలో రచయిత నరసింహ శర్మ, సాహితీవేత్తలు తదితరులు

సీతంపేట, ఆగస్టు 28: ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో సహృదయ సాహితి, ప్రసనన భారతి సంస్థల సంయుక్త నిర్వాహణలో ప్రముఖ కవి, అనువాదకులు డాక్టర్ రాచకొండ నరసింహ శర్మ 101వ జన్మదినోత్సవం, ఆయన రచించిన అనువాద కవితా సంపుటి పంజరంలో పక్షి పుస్తకం ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రసన్న భారతి సంపాదకులు కొండేపూడి సర్వేశ్వర ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన నాగార్జున యూనివర్సిటీ మాజీ ఉపకులపతి ఆచార్య బాలమోహన్‌దాస్ ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వందేళ్లు నిండి 101వ సంవత్సరంలో అడుగుపెడుతున్న కవి రాచకొండ నరసింహ శర్మని వివిధ సాహిత్య సంస్థల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆత్మీయ అతిథులుగా డాక్టర్ జి.రఘురామ్, శేఖరమంత్రి ప్రభాకర్‌లు పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.జి. వేణు, డాక్టర్ సూరపనేని విజయకుమార్, ద్విభాష్యంరాజేశ్వరరావు, ఉప్పల అప్పలరాజు, డాక్టర్ కె.వి.ఎస్. మూర్తి, కొత్తూరు రమణ, సాహిత్య అభిమానులు పాల్గొన్నారు.

కల్యాణ మండపానికి శంకుస్థాపన

జగదాంబ కూడలి, ఆగస్టు 28: వన్‌టౌన్ ప్రాంతంలో చరిత్రగల వాసవి ఆలయానికి సంబంధించి కల్యాణమండపం పునర్నిర్మాణంతో భవిష్యత్తులో మరిన్ని సేవలు ఒనగూరుతాయని ఎంపీ శ్రీభరత్ పేర్కొన్నారు. బుధవారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న వాసవీ కల్యాణ మండపం పునర్నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, వాసవీ కల్యాణ మండపం నిర్వాహక కమిటీ సభ్యులు కంకటాల మల్లిక్, రామ్మూర్తి పాల్గొన్నారు.

చెట్లు నరికివేతపై ఆందోళన

మహారాణిపేట, ఆగస్టు 28: జిల్లా పరిషత్ సమీపంలోని ఓ ఆసుపత్రి నిర్మాణానికి చెట్లను తొలగిస్తుండడంపై క్లైమెట్‌ఫ్రంట్ వైజాగ్ టీం సభ్యులు ఆందోళన వ్యక్తంచేశారు. బుధవారం జంక్షన్‌లో ఈ మేరకు నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ చెట్లను కూ ల్చివేయకుండా వేరొక చోటకి మార్చాలనికోరినా జీవీఎంసీ పట్టించుకోలేదని వాపోయారు. చెట్లు నరికివేతతో భవిష్యత్తు తరాలకు పెద్ద ప్ర మాదమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు ఓంద్రిలా, అంజ, కార్తీక్, రాజేష్, విజ్ఞాన్, వర్షిత్, ఉదయ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

'వార్డు పరిపాలనా కార్యదర్శులకు న్యాయం చేయాలి'



మంత్రి నారాయణకు వినతి పత్రం అందిస్తున్న సంఘం నాయకులు

మహారాణిపేట, ఆగస్టు 28: గ్రామీణ ప్రాంతంలో పంచా యతీ కార్యదర్శులకు కల్పిస్తున్న అధికారాలను పట్టణ ప్రాం తంలో పనిచేస్తున్న వార్డు అడ్మి నిస్ట్రేటివ్ సెక్రటరీలకూ కల్పించాలని గ్రామ వార్డు సచి వాలయ ఉద్యోగులు రాష్ట్ర పట్టణాభివృద్ధి, పురపాలక శాఖా మంత్రి పి. నారాయణకు కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వార్డు పరిపాలనా కార్య దర్శులు సంఘం ఉపాధ్యక్షుడు పి. జె. గణేశ్‌కుమార్, జీవీఎంసీ ఎంప్లాయిస్ గౌరవ అధ్యక్షుడు ఎం.ఆనందరావు ఆధ్వర్యంలో సెక్రటరీలు మంత్రిని కలసి వినతి పత్ర మం దించారు. వార్డు పరిపాలనా కార్యదర్శులందరికీ జూనియర్ అసిస్టెంట్ పే స్కేల్ వర్తింప చేయాలని కోరారు. బూత్ లెవల్ ఆఫీసర్ విధులనుంచి తప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి చింతకాయల బంగార్రాజు, విశాఖ జిల్లా అధ్యక్షుడు ఎన్.వి. సందీప్‌కుమార్, జనరల్ సెక్రటరీ పైడిరాజు, ఉపాధ్యక్షుడు సూర్య శరణ్య, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పూర్ణామార్కెట్‌లో అనధికార వర్తక సంఘంపై ఫిర్యాదు

పూర్ణామార్కెట్, ఆగస్టు 28: సర్దార్ వల్లభాయ్ పటేల్ (పూర్ణామార్కెట్)లో అనధికారంగా సాగుతున్న దందాలపై వ్యాపారవర్గాలు బుధవారం ఎమ్మెల్యే వంశీకృష్ణకు ఫిర్యాదు చేశారు. వర్తక సంఘం కమిటీ పేరుతో వైసీపీ వార్డు నాయకులు అడ్డగోలుగా వ్యాపారుల నుంచి దోచుకుంటున్నట్టు ఈ సందర్భంగా వివరించారు. విశాఖ విజయ వినాయక ఉత్సవాలపేరుతో వైసీపీ వార్డు నాయకుడు అందినంత దోచుకుంటున్నట్టు తెలిపారు. పూర్ణామార్కెట్ రోడ్డుపై స్థలానికి సంబంధించి వ్యాపారులనుంచి అనధికార వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. గత పదేళ్లకు పైగా వర్తక సంఘంకు ఎన్నికలు నిర్వహించలేదని ఆరోపించారు. తక్షణం వీరిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఏయూలో అక్రమాల నిగ్గుతేలేనా?

... 5వ పేజీ తరువాయి

తీసుకువెళ్లేందుకు పలువురు సిద్ధమవుతున్నారు.

పీహెచ్‌డీ పట్టాలతో వ్యాపారం

సుమారు వందేళ్ల చరిత్ర కలిగిన ఆంధ్ర యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందడాన్ని చాలామంది గౌరవంగా భావిస్తున్నారు. అటువంటి వారి ఆశను సొమ్ము చేసుకునే ప్రయత్నాన్ని గత పాలకులు చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయమై అప్పట్లో స్వయంగా ఒక సీనియర్ ప్రొఫెసర్ కూడా విమర్శలు గుప్పించారు. తనకు కావాల్సిన వారికి పదవులు, గిట్టని వారికి వేధింపులు అన్న చందంగా ప్రసాదరెడ్డి పాలన సాగింది. గతంలో ఇబ్బందులు పడిన ఎంతోమంది ఉద్యోగులు మంత్రికి ఫిర్యాదు చేసేందుకు సిద్ధ మవుతున్నారు. గెస్ట్ ఫ్యాకల్టీ కూడా తమను విధుల్లోకి తీసు కోవాలంటూ కోరబోతున్నారు.

అధికారుల ఏర్పాట్లు

మంత్రి లోకేశ్ శుక్రవారం వర్సిటీని సందర్శించనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మంత్రిని ఆ హబ్‌తోపాటు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ పరిశీలించనున్నారు.అనంతరం వర్సిటీ క్యాంపస్‌లో మూడు వేలకుపైగా మొక్కలను నాటే కార్యక్రమాన్ని మంత్రితో ప్రారంభింపజేయ నున్నారు. మంత్రి జిల్లాకు వస్తున్న నేపథ్యంలో వర్సిటీలోని ఉద్యోగులు అంతా అందుబాటులో ఉండాలని, సెలవులు పెట్టవద్దని ఆదేశాలు జారీచేసినట్టు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ధనుంజయ్ తెలిపారు.

ఐటీ అభివృద్ధిపై ఆశలు

... 5వ పేజీ తరువాయి

ఇస్తామని హామీ ఇచ్చారు. ఆ ప్రాజెక్టును తక్షణమే పట్టాలు ఎక్కించాల్సి ఉంది.

● రుషికొండ హిల్ నంబరు 2లో కెనెక్సా కంపెనీ నుంచి వెనక్కి తీసుకున్న 20 ఎకరాల భూమి ఉంది. అందులో ఐటీ టవర్ నిర్మిస్తామని వైసీపీ ప్రభుత్వం ప్రకటించింది. ఎవరూ ముందుకురాలేదు. ఆభూమిని సద్వినియోగం చేయాల్సి ఉంది.

ఐటీ కాన్సెప్ట్ సిటీలు అవసరం

ఐటీని అభివృద్ధి చేయడానికి కాన్సెప్ట్ సిటీలు అవసరం. రుషికొండ, భోగాపురం వీటికి అనువైన ప్రాంతాలు. కాలేజీల నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు ఐటీ రంగానికి ఉపయోగపడేలా మైసూర్‌లో ఇన్ఫోసిస్ నిర్వహిస్తున్న శిక్షణ కేంద్రం లాంటిది ఇక్కడ ఏర్పాటుచేయాలి. ఐటీని ఉత్తేజపరిచేలా కొత్త పాలసీని తీసుకురావాలి. ప్రతి మూడు నెలలసారి ఐటీ పారిశ్రామికవేత్తలతో ప్రభుత్వ ప్రతినిధులు సమావేశాలు నిర్వహించాలి.

- ఓ.నరేశ్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్, రుషికొండ ఐటీ పార్క్

జోరు వాన

... 5వ పేజీ తరువాయి

అల్లిపురం, రైల్వే న్యూకాలనీ, జ్ఞానాపురం ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిలిచిపోయింది. పూర్ణామార్కెట్‌లో కూరగాయలు, సామగ్రి కొనుగోలు చేయడానికి వచ్చిన మహిళలు ఇళ్లకు చేరడానికి ఇబ్బందులు పడ్డారు. గోపాలపట్నం, కాకానినగర్, మధురవాడ, పెందుర్తి, కొమ్మాది ప్రాంతాల్లో గెడ్డలు పొంగాయి. సాయంత్రం నుంచి రాత్రి 11 గంటల వరకు నగరంలోని గంభీరంలో 51, సింహాచలంలో 49.75, కాపులుప్పాడలో 47, భీమిలిలో 46.25, పెందుర్తి బీసీ కాలనీలో 43.25, హెచ్‌బీ కాలనీలో 43 మి.మీ. వర్షపాతం నమోదైంది.

బదిలీల కోసం...

... 5వ పేజీ తరువాయి

, అనకాపల్లి జిల్లాల్లో పనిచేస్తున్న తహసీల్దార్లు పలువురు విశాఖ రావడానికి ఆయా జిల్లా కలెక్టర్లకు దరఖాస్తు చేసుకున్నారు. ఏజెన్సీలో ఉన్న ఉద్యోగులు...ముఖ్యంగా 50 సంవత్సరాల వయస్సు పైబడినవారు మైదానం/నగరంలో పోస్టింగ్ ఇవ్వాలని కోరుతున్నారు. విశాఖ జిల్లాలో రెండు తహసీల్దార్ల పోస్టులు మాత్రమే ఖాళీగా ఉన్నాయి. ఇంకా జిల్లాలో ఒకరిద్దరు తహసీల్దార్లకు బదిలీ ఉంటుందనే ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో పలువురు తహసీల్దార్లు రాజకీయ నాయకుల ద్వారా కలెక్టర్‌కు సిఫారసు చేయించారని తెలిసింది.

చెకింగ్ ఇన్‌స్పెక్టర్ల పోస్టులకు గిరాకీ

నగరంలో పౌర సరఫరాల శాఖలో చెకింగ్ ఇన్‌స్పెక్టర్ల పోస్టులకు గిరాకీ ఏర్పడింది. గ్రామీణ ప్రాంతాల నుంచి నగరంలో చెకింగ్ ఇన్‌స్పెక్టర్లుగా రావాలని ప్రజా ప్రతినిధుల నుంచి పలువురు సిఫారసు లేఖలు సమర్పించారు. నగరంలో పనిచేస్తున్న చెకింగ్ ఇన్‌స్పెక్టర్ ఒకరు 20 మంది డీలర్లను తీసుకుని ఒక ఎమ్మెల్యే వద్దకు వెళ్లి మరీ లేఖ తీసుకున్నారు. ఐదేళ్ల సర్వీస్ దాటినవారు కూడా ఇక్కడే కొనసాగించాలని ఎమ్మెల్యేల నుంచి సిఫారసు లేఖలు తెచ్చుకుంటున్నారు. ఎనిమిది నుంచి పదేళ్లుగా నగరంలో పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్లు కూడా కదలడానికి ససేమిరా అంటున్నారు. పలు వివాదాలతో గ్రామీణ ప్రాంతానికి బదిలీ అయిన ఉద్యోగి ఆనందపురం ఆర్‌ఐగా రావాలని పైరవీ చేస్తున్నారు. ఒకసారి ఆర్‌ఐగా పనిచేసిన వ్యక్తిని రెండోసారి అదే పోస్టులో నియమించకూడదు. కానీ నగరం నుంచి బియ్యం ఆనందపురం మీదుగా ఇతర ప్రాంతాలకు వెళుతున్నందున అక్కడ పోస్టింగ్ దక్కితే దండిగా సంపాదించుకోవచ్చునని కూటమి నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. పౌర సరఫరాల శాఖలో తిష్ట వేసినఇన్‌స్పెక్టర్లనుసాగనంపాలని రెవెన్యూ ఉద్యోగులు కోరుతున్నారు.చెకింగ్ ఇన్‌స్పెక్టర్లుగా పనిచేస్తున్నవారిలో పలువురిపై ఆరోపణలు ఉన్నాయి.

3 నెలల్లో ఉక్కును గాడిలో పెడతా

... 5వ పేజీ తరువాయి

తగ్గదన్నారు. గంగవరం పోర్టులో ఆటాచ్‌మెంట్‌లో ఉన్న కోకింగ్ కోల్‌ను రెండు, మూడు రోజుల్లో విడిపిస్తామన్నారు. కార్మిక సంఘ నాయకులు మాట్లాడుతూ గత మూడేళ్లలో అవినీతి అధికమైందని ఆరోపించారు. కొనుగోలు విభాగంలో అవకతవకలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఫెర్రో అల్లాయిస్, ఫెర్రో మాంగనీస్ తదితరాలను నాణ్యత తక్కువ ఉన్నవి కొని ఎక్కువ మొత్తంలో నిధులు తినేస్తున్నారని, వాటికి చెక్ పెట్టాలని డిమాండ్ చేశారు. ఇటీవల కాలంలో యాజమాన్యం తీసుకున్న చర్యలను అంతా వ్యతిరేకించారు. ఇతర ప్లాంట్లకు ఉద్యోగుల తరలింపు, సీఐఎస్ఎఫ్ సిబ్బందిలో కోత, వీఆర్ఎస్ అమలుకు ప్రణాళిక వంటి అంశాలను నిరసించారు. కాంట్రాక్టు కార్మికులకు నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వలేదని, వెంటనే ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో పర్సనల్ డైరెక్టర్ పాండే, ప్రాజెక్ట్ డైరెక్టర్ అనిల్ కుమార్ బాగ్చి, వివిధ విభాగాల అధిపతులు, కార్మిక సంఘ నాయకులు కేఎస్ఎన్ రావు, మంత్రి రాజశేఖర్, ఎన్.రామచంద్రరావు, వరసాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

1న వినాయక బొమ్మల తయారీపై ఉచిత శిక్షణ

డాబాగార్డెన్స్, ఆగస్టు 28: బాల వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబరు ఒకటో తేదీన వినాయక మట్టి బొమ్మల తయారీపై ఈనెల 1న ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు బీవీఎఫ్ కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. ఫిషింగ్ హార్బర్ సమీపంలోని బాల వికాస్ ఫౌండేషన్ బ్రిడ్జి స్కూల్ ఆవరణలో గ్రీన్‌క్లైమేట్ సహకారంతో ఈ శిక్షణ ఉంటుందన్నారు.వివరాలకు 90324 77463ను సంప్రదించాలని కోరారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు అస్తవ్యస్తం

▸ సివిల్ జడ్జి వెంకటశేషమ్మ



అవగాహన కల్పిస్తున్న వెంకటశేషమ్మ

కంచరపాలెం, ఆగస్టు 28: మాదక ద్రవ్యాల వినియోగం, ర్యాగింగ్ తదితర అసాంఘిక కార్యకలాపాలపై కఠిన శిక్షలు అమలులో ఉన్నట్టు సీనియర్ జడ్జి శ్రీమతి ఎం. వెంకటశేషమ్మ అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, డ్రగ్స్ తదితర వ్యసనాలకు యువత దూరంగా ఉండాలన్నారు. చక్కని క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకుని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని సూచించారు. చట్టవ్యతిరేక కలాపాలకు పాల్పడితే అమలు చేసే చట్టపరంగా శిక్షలను ఆమె వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.నారాయణ రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడాకారిణి జ్యోతికి సత్కారం

అక్కయ్యపాలెం, ఆగస్టు 28: ఒలింపిక్ అథ్లెటిక్ క్రీడాకారిణి యర్రాజీ జ్యోతిని కైలాసపురంలోని తన నివాసానికి ఉత్తర నియోజకవర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు కుమార్తె శ్యామలాదీపిక కుటుంబంతో కలిసి వెళ్లి బుధవారం ఘనంగా సత్కరించారు. రానున్న రోజుల్లో మరిన్ని పతకాలు సాధించి మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు.



సత్కరిస్తున్న శ్యామలా దీపిక

నేత్రదానంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న నేత్ర వైద్యశాల సిబ్బంది

సీతంపేట, ఆగస్టు 28: జిల్లా అంధత్వ నివారణ సంస్థ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ వి. మీనాక్షి ఆధ్వర్యంలో ద్వారకా బస్ స్టాండ్‌లో ప్రయాణికులకు నేత్ర దానంఅవశ్యకతపై బ్రోచర్‌లు పంపిణీ చేసి అవగాహన కల్పించారు. అలాగే, 9వ జాతీయ నేత్ర దాన పక్షోత్సవాల్లో భాగంగా ఆల్ ఇండియా రేడియోలో ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల కార్నియా కన్సల్టెంట్ డాక్టర్ మోహన ప్రీతి ప్రసంగించారు. రేడియో ప్రతినిధి దిలీప్ సామాన్యులనుంచి వచ్చే అనేక సందేహాలను డాక్టర్‌ని అడిగి శ్రోతలను అర్థమయ్యేలా వివరించారు. ఆసుపత్రి సిబ్బంది నేత్రదానంపై అపోహలను తొలగించేలా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐ డొనేషన్ కౌన్సిలర్లు పూర్ణిమ, సుజాత, ఇతర టీచర్స్ పాల్గొన్నారు.

పోర్టులో సమ్మె నిర్ణయం విరమణ

జగదాంబ కూడలి, ఆగస్టు 28: పోర్టు కార్మికుల దేశవ్యాప్తంగా తలపెట్టిన నిరవధిక సమ్మె విరమించినట్టు అఖిల పక్ష కార్మిక సంఘం నేతలు వెల్లడించారు. బుధవారం విలేకరులతో విశాఖ పోర్టు అఖిల పక్ష కార్మిక సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ... దేశ వ్యాప్తంగా మేజర్ పోర్టులకు సంబంధించిన కార్మికుల సమస్యలపై ఈనెల 28న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను అఖిలపక్ష సంఘాల నిర్ణయం మేరకు విరమించినట్టు చెప్పారు. ఢిల్లీలోని ఐపీఏలో మేజర్ పోర్టులు, డాక్‌వర్కర్స్ ఆరు ఫెడరేషన్ల చైర్మన్లు, బిడబ్ల్యూఎసీఎండీ, ఐపీఏ మధ్య అవగాహన ఒప్పందం కుదిరినట్టు తెలిపారు.

1న మెగా రక్తదాన శిబిరం

సౌత్ ఎమ్మెల్యే, జనసేన పార్టీ నగర అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్

సీతంపేట, ఆగస్టు 28: జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకల్లో భాగంగా సెప్టెంబరు 1వ తేదీన మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తామని విశాఖ సౌత్ ఎమ్మెల్యే, జనసేన పార్టీ నగర అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్ తెలిపారు. స్థానిక పార్టీ నగర కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సెప్టెంబరు 1న ఉదయం 8 నుంచి సీతంపేటలోని పార్టీ కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే, ఆర్కే బీచ్ క్లీనింగ్, అటవీ శాఖ, పోర్టు సహకారంతో ఐదు వేల మొక్కలు నాటుతామన్నారు. కూటమి ప్రభుత్వ పా లనలో ఎయిర్‌పోర్టు రోడ్డు, రైల్వే జోన్, ఫ్లై



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

ఓవర్లు అందుబాటులో వస్తాయన్నారు. ఓటమికి భయపడి పారిపోకుండా నిలబడి పోరాడాలని మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణనుద్దేశించి సవాల్ విసిరారు. ఏయూ మాజీ వీసీ అరాచకాలపై విచారణ కొనసాగుతోందన్నారు. త్వరలో ఆయనకు శిక్ష తప్పదని హెచ్చరించారు. నార్త్ ఇన్‌చార్జి బొలిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ పంచాయతీ రాజ్, పర్యావరణ శాఖలు పవన్ కల్యాణ్ చూడటం ప్రజల అదృష్టమన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గ ఇన్‌చార్జి పసుపులేటి ఉషా కిరణ్, కల్లెపల్లి వెంకట సీతారామరాజు, సూర్యనారాయణ, శివ ప్రసాద్ రెడ్డి, అంగ ప్రశాంతి పాల్గొన్నారు.

కష్టపడి పనిచేసిన వారికి ప్రాధాన్యం

సీతంపేటలోని నగర జనసేన పార్టీ కార్యాలయంలో మహిళా కమిటీలు, జీవీఎంసీ పరిధిలోని అన్ని వార్డుల జనసేన పార్టీ వీర మహిళలతో వంశీకృష్ణ శ్రీనివాస్ ముఖ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ బలోపేతంపై పలు సూచనలు, సలహాలను వీర మహిళలనుంచి అడిగి తెలుసుకున్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. త్వరలో అన్ని కమిటీలతో పాటు సిటీ మహిళా కమిటీలు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.









అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ సంపత్‌కుమార్

దోమలు వృద్ధి చెందకుండా ప్రజలకు అవగాహన కల్పించాలి

జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్

అగనంపూడి, ఆగస్టు 28: వర్షాకాలం దృష్ట్యా నగరంలో దోమలు వృద్ధి చెందకుండా తగు చర్యలు తీసుకోవాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ ఆదేశించారు. జీవీఎంసీ 79వ వార్డు గల్లవానిపాలెంలో ఆయన బుధవారం పర్యటించారు. నీటి గుంట్లలో దోమలు వృద్ధి చెందకుండా డ్రోన్‌ల సహాయంతో ఎంఎల్ ఆయిల్ పిచకారి చేయు విధానాన్ని పరిశీలించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. తడి పొడి చెత్తను వేర్వేరుగా విభజించి స్థానికులు క్లాప్ వాహనాలకు అందజేయాలని పేర్కొన్నారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ సన్యాసినాయుడు, మలేరియా, శానిటరీ ఇన్స్‌పెక్టర్‌లు శ్రీనివాసరావు, కోటేశ్వరరావు ఉన్నారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలివే..

పెందుర్తి, ఆగస్టు 28: పెందుర్తి సబ్ స్టేషన్ పరిధి దుర్గానగర్ 11కేవీ ఫీడర్‌లో మరమ్మతు పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఈపీడీసీఎల్ ఈఈ పోలాకి శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా బీసీ కాలనీ, నల్లక్వారీ, సూర్యానగర్, సాయిదివ్య లేఅవుట్, కామాక్షమ్మ టెంపుల్, ఉప్పరకాలనీ, మొండిబంద కాలనీ, ఆంజనేయస్వామి ఆలయ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

సరిపల్లి ఫీడర్ పరిధిలో..

సరిపల్లి ఫీడర్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ శ్రీనివాసరావు తెలిపారు. అందువల్ల బృందావన్ గార్డెన్, అఖిలేశ్వరి ఆస్పత్రి ఏరియా, ప్రసాద్‌నగర్, జన చైతన్య లేఅవుట్, దొగ్గవానిపాలెం, రైల్వే స్టేషన్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని, ఈ విషయాన్ని ఆయా ప్రాంతల ప్రజలు గమనించి తమకు సహకరించవలసిందిగా కోరారు.

గుర్రమ్మపాలెంలో అన్న సమారాధన

పెందుర్తి, ఆగస్టు 28: మండలంలోని గుర్రమ్మపాలెంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ముగింపు సందర్భంగా బుధవారం మండల యాదవ సంఘం ఆధ్వర్యంలో అన్న సమారాధన చేపట్టారు. సంఘం అధ్యక్షుడు చందక చలపతిరావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా కృష్ణుని ఆలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు కాయితి ఎర్రిబాబు, ఉరుకూటి లక్ష్మీ గోవింద్, తదితరులు పాల్గొన్నారు

విద్యుత్ శాఖ కార్యాలయంలో సమాచార బోర్డులు ఏర్పాటు

వేపగుంట, ఆగస్టు 28: జీవీఎంసీ 93వ వార్డు పరిధిలోని ఆర్.ఆర్.వి. పురం విద్యుత్ శాఖ కార్యాలయంలో వినియోగదారులకు సమాచారం తెలిసేలా బయట కొత్తగా బోర్డులు ఏర్పాటు చేశారు. ఇక్కడి కేంద్రంలో ఉన్న ఏడీఈ, ఏఈల కార్యాలయాల వెలుపల గోడలపై వీటిని ఏర్పాటు చేశారు. ఆయా బోర్డుల్లో అందించనున్న సేవలు, ఆర్‌టీఐ వివరాలు, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యుత్తు పథకాలు పేర్కొన్నారు. అలాగే, అవసరాలకు అనుగుణంగా ఏ అధికారికి ఫోన్, ఈ మెయిల్ తదితర వివరాలను అందజేయాలో వీటిలో పొందుపరిచారు. నేరుగా సమాచారం తెలిసేలా బోర్డులు ఏర్పాటు చేయడంపై వినియోగదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సినిమా గైడ్

- **మారుతీనగర్ సుబ్రహ్మణ్యం :** సంగం, కామేశ్వరి, సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), విశేష్ (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **ఆయ్ :** రమాదేవి, వెంకటేశ్వర-2, కిన్నెర, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్-3 (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), రాములమ్మ (తగరపువలస)
- **కమిటీ కుర్రోళ్ళు :** శరత్, శ్రీవెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **డిమోంటీ కోలనీ-2 :** మెలోడి, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), లక్ష్మీకాంత్ (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)
- **తంగలాన్ :** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి).
- **మిస్టర్ బచ్చన్ :** సుకన్య (గోపాలపట్నం), కన్య (గాజువాక), తాతా (తగరపువలస)
- **డబుల్ ఇస్మార్ట్ :** జగదాంబ, శ్రీకన్య (గాజువాక)
- **ఆర్.కె.పురంలో :** శ్రీకాంతి

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 46, టమాటా 26, వంకాయలు (తెలుపు) 46, వంకాయలు (నలుపు) 46, బెండకాయలు 23, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 30, బీరకాయలు 40, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 36, క్యాబేజీ 24, క్యారెట్ 28, దొండకాయలు 22, బంగాళదుంపలు 30, అరటికాయ (పెద్దది) 8, అల్లం (పాతది) 120, మునక్కాడలు (కిలో) 38, బరబాటి 32, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 82, గోరుచిక్కుడు 30, దోసకాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 240, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 68, పొటల్స్ 36, కీరదోస 30, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 38, చిలగడదుంపలు 48, కంద 58, దేముడు చిక్కుడు 70, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	520
విజయనగరం	524
శ్రీకాకుళం	524

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 91
ఫారం ధర	-- 111
విత్ స్కిన్	-- 192
స్కిన్‌లెస్	-- 202

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 11లో..



కుంగిపోయిన ప్రశాంతినగర్-బాలాజీనగర్ రోడ్డు



పెందుర్తిలో జలమయమైన రహదారి

మూడు నెలలకే రోడ్డుకు తూట్లు

30 లక్షల రూపాయల వర్షంపాలు » బయటపడిన కాంట్రాక్టరు డొల్లతనం

పెందుర్తి, ఆగస్టు 28: పెందుర్తి సమీపంలోని ప్రశాంతినగర్ నుంచి బాలాజీనగర్ వరకు రూ.30 లక్షల వ్యయంతో మూడు నెలల క్రితం నిర్మించిన రోడ్డు బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి కొట్టుకుపోయింది. ఈ రోడ్డు రెండుగా చీలిపోయి మధ్యలో పెద్ద గొయ్యిలా మారింది. వర్షానికి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో చీకట్లో మార్గమధ్యలో ఉన్న గోతిలో పడి పలువురు ద్విచక్ర వాహనచోదకులు పడిపోయారు. దీంతో డీఆర్‌సీ వ్యవస్థాపక అధ్యక్షుడు దాడి రమణచిట్టి చొరవ తీసుకుని ఈ గొయ్యి చుట్టూ రాళ్లు పేర్చారు. రూ.30 లక్షలతో నిర్మించిన ఈ రహదారి నాణ్యతా లోపంతో వర్షానికి పాడైపోయి గుంతలమయంగా మారడం స్థానికులను విస్మయానికి గురిచేస్తోంది. పలుచోట్ల కంకర రాళ్లు తేలి గోతులు మరింత పెద్దవయ్యాయి. ఎన్నికల ముందు బిల్లుల కోసమని సదరు కాంట్రాక్టరు హడావుడిగా పనులు పూర్తి చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మూడు నెలలకే కొత్తగా వేసిన రోడ్డుకు తూట్లు పడడంతో జీవీఎంసీ ఇంజనీరింగ్ సిబ్బంది పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. రోడ్డు నిర్మాణానికి కాంట్రాక్టర్లు నాసిరకం మెటీరియల్ వాడినా ఇంజనీరింగ్ సిబ్బంది పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

జలమయమైన రహదారులు

సుమారు గంటకు పైగా ఉరుములు, మెరుపులతో కురిసిన భారీ వర్షానికి పెందుర్తిలోని లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. వర్షానికి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో జనజీవనం స్తంభించింది. పలు కాలనీల్లో రహదారులపై నీరు ప్రవహించింది. కొన్నిచోట్ల మట్టి రోడ్లు చిత్తడిగా మారడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. పెందుర్తి నాలుగు రోడ్ల కూడలిలో పెద్దఎత్తున వర్షపు నీరు నిలిచిపోయింది. వాన వెలిశాక విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

మంత్రి లోకేశ్ పర్యటనను సక్సెస్ చేయాలి

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

గాజువాక, ఆగస్టు 28: రాష్ట్ర మానవ వనరులు, ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ విశాఖ పర్యటనను విజయవంతం చేయాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. గాజువాకలోని పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంత్రి హోదాలో తొలిసారిగా విశాఖ విచ్చేస్తున్న లోకేశ్ ఈ నెల 30వ తేదీ వరకు ఇక్కడే ఉంటారన్నారు. వ్యవస్థల పట్ల అవగాహన ఉన్న లోకేశ్ దృష్టికి పలు సమస్యలను తీసుకువెళ్లడం జరిగిందని, త్వరలోనే అవి పరిష్కారమవుతాయన్నారు. గాజువాకలో ఉన్న ప్రతి సమస్యకు అతి త్వరలో పరిష్కారం లభిస్తుందన్నారు. ప్రజలకు సేవ చేసేందుకు తాము నిత్యం అందుబాటులో ఉంటామన్నారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తామని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్లు రౌతు శ్రీనివాసరావు, బొడ్డు నరసింహ పాత్రుడు, మొల్లి ముత్యాలనాయుడు, రాజాన రామారావు, మాజీ కార్పొరేటర్ గొర్లె వెంకునాయుడు, నాయకులు పులి రమణారెడ్డి, పప్పు శంకర్, శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సమాజాన్ని మేల్కొల్పడమే పాత్రికేయుల బాధ్యత: పల్లా శ్రీనివాసరావు

పెదగంట్యాడ: సమాజాన్ని మేల్కొల్పడమే పాత్రికేయుల బాధ్యత అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. అటువంటి జర్నలిస్టుల సంక్షేమం కోసం సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి పెడుతున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ గాజువాక మహాసభ ఇక్కడొక ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో కూడా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల అంశం ఉందని గుర్తు చేశారు. గాజువాక జర్నలిస్టులకు శాశ్వత చిరునామాగా ఉండేందుకు ఒక భవనాన్ని నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఏపీయుడబ్ల్యూజే సీనియర్ నాయకుడు డాక్టర్ ఎస్ఆర్ఎం వర్మ మాట్లాడుతూ వృత్తి నైపుణ్యం పెంపొందించుకునేందుకు నేటి తరం జర్నలిస్టులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించాలని అనంతరం గాజువాక కమిటీకి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షునిగా పేరిచర్ల ప్రసాద్, అధ్యక్షునిగా కొయిలాడ పరశురామ్, ప్రధానకార్యదర్శిగా యల్లపు శేషుబాబు, కోశాధికారిగా దొడ్డి కృష్ణ, తదితరులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బీఎన్ పాత్రుడు, సీనియర్ జర్నలిస్టు నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.



ఒకే తరగతి గదిలో సెకండియర్ ఎంపీసీ, బైపీసీ, సీఈసీ విద్యార్థులు



వరండాలో కూర్చున్న ఫస్టియర్ ఎంపీసీ, బైపీసీ, సీఈసీ విద్యార్థులు

జూనియర్ కళాశాలకు సొంత గూడు కరవు

మల్కాపురంలోని జీవీఎంసీ హైస్కూల్‌లోనే ఆరేళ్లుగా నిర్వహణ

గదుల కొరతతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న విద్యార్థులు



కళాశాల నడుస్తున్న మల్కాపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాల

మల్కాపురం, ఆగస్టు 28: మల్కాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వసతి సమస్యలు నెలకొంది. ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఈ కళాశాలలో గదులు చాలక విద్యార్థులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఒకే గదిలో వివిధ గ్రూపుల వారు ఉండడంతో అధ్యాపకులు చెబుతున్న పాఠాలు సరిగ్గా అర్థం కావడం లేదని పలువురు విద్యార్థులు వాపోతున్నారు. ఈ కారణంగా పరీక్షల్లో ఉత్తీర్ణతపై ఆ ప్రభావం పడుతోంది. ఈ సమస్యను అధిగమించాలంటే విశాలమైన గదులు, వసతులతో కూడిన భవనాలు ఉండాలి. చక్కని బోధనను అందించగల అధ్యాపకులున్నా, ఇరుకు గదుల్లో బోధన సాగించాల్సి వస్తోంది. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ ప్రథమ సంవత్సర విద్యార్థులకు వరండాలో, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు రెండు గదులకు పరిమితం చేసి పాఠ్యాంశాలను బోధిస్తున్నారు. ఇలా ఒకచోటే రెండు, మూడు గ్రూపుల విద్యార్థులకు తరగతులు బోధించడంతో పలువురు విద్యార్థులు గందరగోళానికి గురవుతున్నారు. కళాశాలలో వొకేషనల్ కోర్సు ఉన్నా గదులు సరిపోకపోవడంతో ఈ ఏడాది విద్యార్థులను ఆ కోర్సులో చేర్చుకోవడమే మానేశారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులను రెండు గదుల్లో, ప్రథమ సంవత్సరం వారికి బయట హాల్‌లో విద్యా బోధన సాగిస్తున్నారు. ఈ కళాశాల ప్రారంభమై ఆరేళ్లు గడుస్తున్నా.. విద్యార్థుల సంఖ్య కనీసం వంద కూడా దాటలేదు. దీనికి గత ప్రభుత్వ విధానాలే కారణమని కొంతమంది విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పాఠశాలకు ప్రత్యేక భవనమంటూ లేదు. మల్కాపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాలకు చెందిన అదనపు గదులనే కళాశాల కోసం ప్రత్యేకంగా కేటాయించారు. ఈ కళాశాలకు మరుగుదొడ్ల వసతి కూడా లేదు. పాఠశాలకు చెందిన మరుగుదొడ్లనే కళాశాల విద్యార్థులు కూడా వినియోగిస్తున్నారు. అన్ని సబ్జెక్టులకు సంబంధించి అధ్యాపకులున్నా.. బోధనకు తగినన్ని గదులు లేకపోవడమే ఇక్కడ ప్రధాన సమస్యగా మారింది. ఈ క్రమంలో ప్రస్తుతం ప్రభుత్వం పారిశ్రామిక ప్రాంతంలోనే ఖాళీ స్థలాన్ని గుర్తించి కళాశాల నిర్మాణానికి ప్రయత్నిస్తోంది. అలాగే ఈ కళాశాల ప్రాంగణంలోనే ప్రత్యేకంగా మహిళల కోసం టెన్త్ ప్లస్ టూ కళాశాలను గత వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఒకే ప్రాంగణంలో రెండు కళాశాలలు ఉండడం ఇంటర్మీడియట్ బోర్డు నిబంధనలకు వ్యతిరేకం. అందువల్ల కో-ఎడ్యుకేషన్‌తో కూడిన ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఇక్కడి నుంచి మార్పు చేయాలనే ఆలోచనలో ప్రస్తుత ప్రభుత్వం ఉంది. 2018లో టీడీపీ హయాంలోనే ఈ ప్రభుత్వ కళాశాల ఏర్పాటైంది. ఇప్పుడు మళ్లీ అదే ప్రభుత్వం కొత్త కళాశాల నిర్మాణానికి అడుగులు వేస్తోంది. జూనియర్ కళాశాలకు సొంత భవనాల ఏర్పాటులో స్థానిక ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.



పార్కులో శ్రమదానం చేస్తున్న కాలనీవాసులు

అమరావతి పార్కులో శ్రమదానం

కూర్మన్నపాలెం, ఆగస్టు 28: జీవీఎంసీ 87వ వార్డు పరిధి తిరుమల నగర్‌లోని పార్కులు అధ్వానంగా ఉండడంతో కాలనీవాసులు బుధవారం ఎకో వైజాగ్‌లో భాగంగా స్వచ్ఛ తేహి సేవా కార్యక్రమంలో భాగంగా ఇక్కడి అమరావతి పార్కును శుభ్రపరిచారు. కాలనీ వాసులంతా ఆహ్లాదకర వాతావరణంలో సేద తీరేందుకు వీలుగా పార్కులను వారు పరిశుభ్రంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు విశ్వేశ్వరరావు, పరమానందం మాట్లాడుతూ పార్కుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, పిచ్చిమొక్కలను జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది సహకారంతో తొలగిస్తున్నామన్నారు. అలాగే రహదారులను చీపుర్లతో ఊడ్చామన్నారు. ఇళ్ల పరిసరాల్లో చెత్తాచెదారం పేరుకుపోకుండా చూసుకుంటామని కాలనీ వాసులతో కలిసి ప్రతిజ్ఞ చేశామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు నాగభూషణం, సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభా అవార్డులు సాధించిన విద్యార్థులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిత

కూర్మన్నపాలెం, ఆగస్టు 28: క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కణితి హైస్కూల్ బి.సూర్యప్రకాశ్ అన్నారు. 87వ వార్డు కణితి హైస్కూల్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గురువారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని 2023-24 విద్యా సంవత్సరంలో పాఠశాల క్రీడల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన పాఠశాలలను జిల్లాకు ఐదు చొప్పున ఎంపిక చేశారు. ఇందులో విశాఖ జిల్లా నుంచి 180 పాయింట్లుతో మొదటి స్థానంలో ఉన్న కణితి హైస్కూల్‌ను క్రీడా ప్రతిభ అవార్డుకు ఎంపిక చేశారన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.మన్నాజీ, కె.నారాయణలు మాట్లాడుతూ కృషి, పట్టుదల ఉన్న విద్యార్థులు ఏ రంగంలోనైనా విజయాలను నమోదు చేసుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అరుణ, శ్రీనివాస్, షేక్ ప్రసాద్, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాజశేఖర్

ఉక్కు శాఖా మంత్రి తన హామీని నిలబెట్టువాలి

ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 28: స్టీల్‌ప్లాంట్ పర్యటనకు గతంలో విచ్చేసిన కేంద్ర ఉక్కు శాఖా మంత్రి కుమారస్వామి ఇచ్చిన హామీని నిలబెట్టుకుని, కర్మాగారాన్ని ప్రైవేటీకరించబోమని ప్రకటన చేయాలని ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ డిమాండ్ చేశారు. ప్లాంట్‌లో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేడు ప్లాంట్ పరిస్థితి చాలా ఇబ్బందికరంగా మారిందన్నారు. ఇదే పరిస్థితి మరికొన్ని రోజులు కొనసాగితే ఉక్కు కర్మాగారం తీవ్ర ఇబ్బందుల్లోకి వెళిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాంటులో ఉద్యోగులు ఉత్పత్తి తీసేందుకు సిద్ధంగా ఉన్నా, అందుకు తగ్గ వనరులు కల్పించడంలో ఉక్కు యాజమాన్యం విఫలమైందన్నారు. కార్మిక, సంస్థ ప్రగతి కోసం ఇంటక్ ఎనలేని కృషి చేస్తుందన్నారు. సమావేశంలో కార్యక్రమంలో నాయకులు నీరుకొండ రామచంద్రరావు, కారు రమణ, రాపర్తి కోటేశ్వరరావు, ప్రభాకరరెడ్డి, మోహన్, గంగవరం గోపి, తదితరులు పాల్గొన్నారు.

'బ్లాస్ట్ ఫర్నేస్'లోని సమస్యలను పరిష్కరించాలని వినతి

స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్ ఫర్నేస్ విభాగంలో నెలకొన్న ప్రధాన సమస్యలను పరిష్కరించవలసిందిగా కార్మిక సంఘ నాయకులు విభాగాధిపతి అజయ్‌కుమార్‌రెడ్డిని కోరారు. ప్లాంట్‌లో విభాగాధిపతితో వారు సమావేశమై పలు అంశాలపై చర్చించారు. అత్యంత ఉష్ణోగ్రత కలిగిన విభాగంలో విధులు నిర్వహించే ఉద్యోగులకు సౌకర్యాలు కల్పించాలని విన్నవించారు. ఉక్కు ఉత్పత్తి చేసేదుటకు కార్మిక వర్గం సిద్ధంగా ఉందని, అందుకు తగిన వనరులను యాజమాన్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మార్టుపూడి పరదేశి, పిట్టా రెడ్డి, అప్పారావు, అప్పలరాజు, వరప్రసాద్, తదితరలుట పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని..



సీజీఎం (వర్క్స్) శ్రీధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు

స్టీల్‌ప్లాంటులో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీజీఎం (వర్క్స్) యు.శ్రీధర్‌ను ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు వినతిపత్రం అందజేశారు. పలు సమస్యలతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, పని ప్రదేశంలో భద్రతా ప్రమాణాలను పెంచాలని, పనిముట్లు ఇవ్వాలని, వర్క్ డ్రెస్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా సకాలంలో జీతాలు ఇచ్చే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. కొన్ని విభాగాల్లో ఐదారు నెలలుగా జీతాలు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు మంత్రి రవి, నమ్మి రమణ, భాస్కరరావు, రవిరెడ్డి, వి.అప్పారావు, రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

డీఎస్‌హెచ్) కమిషనర్ శిరీష

అగనంపూడి, ఆగస్టు 28: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వైద్యులు, సిబ్బంది పనితీరుపై ఫిర్యాదులొస్తే చర్యలు తప్పవని డైరెక్టర్ ఆఫ్ సెకెండరీ గ్రేడ్ హెల్త్ (డీఎస్‌హెచ్) కమిషనర్ శిరీష అన్నారు. అగనంపూడి ఏరియా ఆస్పత్రిని బుధవారం ఆమె సందర్శించారు. రోగులతో, సహాయకులతో కాసేపు మాట్లాడారు. రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా ఇబ్బందులుంటే ధైర్యంగా తనకు చెప్పాలని సూచించారు. ఆస్పత్రి మొత్తం పరిశీలించారు. కాగా ల్యాబ్ సిబ్బంది దురుసుగా మాట్లాడుతున్నారని, రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కమిషనర్‌కు పలువురు ఫిర్యాదు చేశారు. కదల్లేని స్థితిలో ఉన్న ల్యాబ్‌కు వెళ్లి రక్త పరీక్షలు చేయించుకోవాల్సి వస్తుందని ఆమెకు వివరించారు. సిబ్బంది ఫోన్‌లో మాట్లాడుకుంటూ రోగులపై నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారన్నారు. అనంతరం శిరీష వైద్యులు, సిబ్బందితో సమావేశమయ్యారు. కార్యక్రమంలో శంకర్ ప్రసాద్, హేమలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంటుకు అండగా కూటమి ప్రభుత్వం

త్వరలో కేంద్రం నుంచి రూ.1,500 కోట్ల సాయం

బీజేపీ 'గాజువాక' కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న కరణంరెడ్డి నరసింగరావు

కూర్మన్నపాలెం, ఆగస్టు 28: స్టీల్‌ప్లాంటును కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 1,294వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉక్కు కర్మాగారానికి గతంలో సమస్య వాటిల్లినప్పుడు అప్పటి ఎన్‌డీఏ ప్రభుత్వంలోని దివంగత ప్రధాని వాజపేయి సుమారు 1,333 కోట్ల ఆర్థిక సాయం చేసి ఆదుకున్నారన్నారు. అలాగే నేడు కేంద్ర ప్రభుత్వం తరపున మరో రెండు వారాల్లో సుమారు రూ.1,500 కోట్లు మంజూరు చేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారన్నారు. ఇటీవలే ఓఎండీసీ ఒడిశా నుంచి ఏపీకి గనులను కేటాయించారనీ, ఐఓసీఎల్-ఆర్ఐఎన్ఎల్ మధ్య గ్రీజు, ఆయిల్ సరఫరాకు మరో ఐదేళ్ల ఒప్పందంతో ఎంవోయూ జరిగిందని పేర్కొన్నారు. జనసేన నాయకుడు గంధం వెంకట్రావు మాట్లాడుతూ ఉక్కు కర్మాగారానికి చేయూత నిచ్చేందుకు ముందుకు వస్తున్న పీఎం మోదీకి, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు విళ్లా రామ్మోహన్‌కుమార్, బలిరెడ్డి సత్యనారాయణ, శంకరరావు, యువశ్రీ, ఉగ్రం, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రారంభం

పెందుర్తి, ఆగస్టు 28: సుజాతనగర్ 80 అడుగుల రోడ్డు సమీపంలోని రత్నగిరి కాలనీలో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు తన క్యాంపు నూతన కార్యాలయాన్ని గురువారం ఉదయం 9 గంటలకు ప్రారంభించనున్నారు. ఈ క్యాంపు ఆఫీస్‌లో వారంలో ఒక రోజు గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నారు.

బాలకృష్ణునికి 108 రకాల పిండివంటలు నివేదన

కూర్మన్నపాలెం, ఆగస్టు 28: జీవీఎంసీ 71వ వార్డు శ్రీనగర్‌లో శ్రీకృష్ణ, గణపతి, రమా సహిత సత్యనారాయణస్వామి ఆలయంలో బుధవారం కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా శ్రీకృష్ణ భగవానునికి అర్చకులు భూషణ శర్మ పంచామృతాలతో అభిషేకాలు, అష్టోత్తర శతనామాలతో తులసీ దళార్చనలు చేశారు. అనంతరం ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. భక్తులు సమర్పించిన 108 రకాల పిండివంటలను బాలకృష్ణునికి నైవేద్యంగా సమర్పించారు. భక్తుల ఆటపాటల నడుమ స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు కరేటి సహదేవరావు, లక్ష్మణరాజు, శ్రీనివాసరాజు, ఎ.సూర్యనారాయణ, కృష్ణ మునీంద్ర, తదితరులు పాల్గొన్నారు.



సత్యనారాయణస్వామి ఆలయ ఘాట్ రోడ్డు వద్ద ప్రసాదాల కౌంటర్లు



ప్రసాదాల కౌంటర్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

పూర్ణామార్కెట్, ఆగస్టు 28: ఇసుక కొండ సత్యనారాయణ స్వామి ఆలయం అధికారులు పూర్ణామార్కెట్ మెయిన్ రోడ్డు ఘాట్ రోడ్డు ప్రధాన ద్వారం వద్ద రెండు ప్రసాదాల కౌంటర్లను భక్తుల కోసం ఏర్పాటు చేశారు. బుధవారం ఉదయం ఈ కౌంటర్లను దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్నవరం దేవస్థానంలో తరహాలో ఇక్కడి ఘాట్ రోడ్డు ముఖద్వారం వద్ద ప్రసాదాల కౌంటర్లు ఏర్పాటు చేయడం భక్తులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, నాయకులు, ఆలయ అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


ధర్నాలో సీఐటీయూ నాయకులు, కార్మికులు

విశాఖపట్నం, ఆగస్టు 28: కాంట్రాక్టు కార్మికులకు జీతాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ నాయకులు బుధవారం డీఆర్ఎం కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రైల్వే యూనియన్ సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి. శ్రీనివాసరావు మాట్లాడుతూ, రైల్వేలోని ఓబీహెచ్ఎస్‌లో పనిచేసిన కాంట్రాక్టు కార్మికులకు గత ఏడాదికి చెందిన నాలుగు నెలల జీతాలను సౌముక్ కంపెనీయాజమాన్యం చెల్లించకుండా పారిపోయిందన్నారు. రైల్వే అధికారులు స్పందించి చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.








మంత్రి లోకేశ్‌కు నేతల ఘన స్వాగతం

నాలుగు రోజుల పర్యటన సందర్భంగా బుధవారం రాత్రి విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న ఐటీ, విద్యా శాఖా మంత్రి నారా లోకేశ్‌కు స్వాగతం పలుకుతున్న పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, విశాఖ దక్షిణ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్

పంజరంలో పక్షి పుస్తకం ఆవిష్కరణ


పుస్తకావిష్కరణలో రచయిత నరసింహ శర్మ, సాహితీవేత్తలు తదితరులు

సీతంపేట, ఆగస్టు 28: ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో సహృదయ సాహితి, ప్రసనన భారతి సంస్థల సంయుక్త నిర్వాహణలో ప్రముఖ కవి, అనువాదకులు డాక్టర్ రాచకొండ నరసింహ శర్మ 101వ జన్మదినోత్సవం, ఆయన రచించిన అనువాద కవితా సంపుటి పంజరంలో పక్షి పుస్తకం ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రసన్న భారతి సంపాదకులు కొండేపూడి సర్వేశ్వర ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన నాగార్జున యూనివర్సిటీ మాజీ ఉపకులపతి ఆచార్య బాలమోహన్‌దాస్ ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వందేళ్లు నిండి 101వ సంవత్సరంలో అడుగుపెడుతున్న కవి రాచకొండ నరసింహ శర్మని వివిధ సాహిత్య సంస్థల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆత్మీయ అతిథులుగా డాక్టర్ జి.రఘురామ్, శేఖరమంత్రి ప్రభాకర్‌లు పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.జి. వేణు, డాక్టర్ సూరపనేని విజయకుమార్, ద్విభాష్యంరాజేశ్వరరావు, ఉప్పల అప్పలరాజు, డాక్టర్ కె.వి.ఎస్. మూర్తి, కొత్తూరు రమణ, సాహిత్య అభిమానులు పాల్గొన్నారు.

కల్యాణ మండపానికి శంకుస్థాపన

జగదాంబ కూడలి, ఆగస్టు 28: వన్‌టౌన్ ప్రాంతంలో చరిత్రగల వాసవి ఆలయానికి సంబంధించి కల్యాణమండపం పునర్నిర్మాణంతో భవిష్యత్తులో మరిన్ని సేవలు ఒనగూరుతాయని ఎంపీ శ్రీభరత్ పేర్కొన్నారు. బుధవారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న వాసవీ కల్యాణ మండపం పునర్నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, వాసవీ కల్యాణ మండపం నిర్వాహక కమిటీ సభ్యులు కంకటాల మల్లిక్, రామ్మూర్తి పాల్గొన్నారు.

చెట్లు నరికివేతపై ఆందోళన

మహారాణిపేట, ఆగస్టు 28: జిల్లా పరిషత్ సమీపంలోని ఓ ఆసుపత్రి నిర్మాణానికి చెట్లను తొలగిస్తుండడంపై క్లైమెట్‌ఫ్రంట్ వైజాగ్ టీం సభ్యులు ఆందోళన వ్యక్తంచేశారు. బుధవారం జంక్షన్‌లో ఈ మేరకు నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ చెట్లను కూ ల్చివేయకుండా వేరొక చోటకి మార్చాలనికోరినా జీవీఎంసీ పట్టించుకోలేదని వాపోయారు. చెట్లు నరికివేతతో భవిష్యత్తు తరాలకు పెద్ద ప్ర మాదమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు ఓంద్రిలా, అంజ, కార్తీక్, రాజేష్, విజ్ఞాన్, వర్షిత్, ఉదయ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

'వార్డు పరిపాలనా కార్యదర్శులకు న్యాయం చేయాలి'


మంత్రి నారాయణకు వినతి పత్రం అందిస్తున్న సంఘం నాయకులు

మహారాణిపేట, ఆగస్టు 28: గ్రామీణ ప్రాంతంలో పంచా యతీ కార్యదర్శులకు కల్పిస్తున్న అధికారాలను పట్టణ ప్రాం తంలో పనిచేస్తున్న వార్డు అడ్మి నిస్ట్రేటివ్ సెక్రటరీలకూ కల్పించాలని గ్రామ వార్డు సచి వాలయ ఉద్యోగులు రాష్ట్ర పట్టణాభివృద్ధి, పురపాలక శాఖా మంత్రి పి. నారాయణకు కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వార్డు పరిపాలనా కార్య దర్శులు సంఘం ఉపాధ్యక్షుడు పి. జె. గణేశ్‌కుమార్, జీవీఎంసీ ఎంప్లాయిస్ గౌరవ అధ్యక్షుడు ఎం.ఆనందరావు ఆధ్వర్యంలో సెక్రటరీలు మంత్రిని కలసి వినతి పత్ర మం దించారు. వార్డు పరిపాలనా కార్యదర్శులందరికీ జూనియర్ అసిస్టెంట్ పే స్కేల్ వర్తింప చేయాలని కోరారు. బూత్ లెవల్ ఆఫీసర్ విధులనుంచి తప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి చింతకాయల బంగార్రాజు, విశాఖ జిల్లా అధ్యక్షుడు ఎన్.వి. సందీప్‌కుమార్, జనరల్ సెక్రటరీ పైడిరాజు, ఉపాధ్యక్షుడు సూర్య శరణ్య, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పూర్ణామార్కెట్‌లో అనధికార వర్తక సంఘంపై ఫిర్యాదు

పూర్ణామార్కెట్, ఆగస్టు 28: సర్దార్ వల్లభాయ్ పటేల్ (పూర్ణామార్కెట్)లో అనధికారంగా సాగుతున్న దందాలపై వ్యాపారవర్గాలు బుధవారం ఎమ్మెల్యే వంశీకృష్ణకు ఫిర్యాదు చేశారు. వర్తక సంఘం కమిటీ పేరుతో వైసీపీ వార్డు నాయకులు అడ్డగోలుగా వ్యాపారుల నుంచి దోచుకుంటున్నట్టు ఈ సందర్భంగా వివరించారు. విశాఖ విజయ వినాయక ఉత్సవాలపేరుతో వైసీపీ వార్డు నాయకుడు అందినంత దోచుకుంటున్నట్టు తెలిపారు. పూర్ణామార్కెట్ రోడ్డుపై స్థలానికి సంబంధించి వ్యాపారులనుంచి అనధికార వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. గత పదేళ్లకు పైగా వర్తక సంఘంకు ఎన్నికలు నిర్వహించలేదని ఆరోపించారు. తక్షణం వీరిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఏయూలో అక్రమాల నిగ్గుతేలేనా?

... 5వ పేజీ తరువాయి

తీసుకువెళ్లేందుకు పలువురు సిద్ధమవుతున్నారు.

పీహెచ్‌డీ పట్టాలతో వ్యాపారం

సుమారు వందేళ్ల చరిత్ర కలిగిన ఆంధ్ర యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందడాన్ని చాలామంది గౌరవంగా భావిస్తున్నారు. అటువంటి వారి ఆశను సొమ్ము చేసుకునే ప్రయత్నాన్ని గత పాలకులు చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయమై అప్పట్లో స్వయంగా ఒక సీనియర్ ప్రొఫెసర్ కూడా విమర్శలు గుప్పించారు. తనకు కావాల్సిన వారికి పదవులు, గిట్టని వారికి వేధింపులు అన్న చందంగా ప్రసాదరెడ్డి పాలన సాగింది. గతంలో ఇబ్బందులు పడిన ఎంతోమంది ఉద్యోగులు మంత్రికి ఫిర్యాదు చేసేందుకు సిద్ధ మవుతున్నారు. గెస్ట్ ఫ్యాకల్టీ కూడా తమను విధుల్లోకి తీసు కోవాలంటూ కోరబోతున్నారు.

అధికారుల ఏర్పాట్లు

మంత్రి లోకేశ్ శుక్రవారం వర్సిటీని సందర్శించనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మంత్రిని ఆ హబ్‌తోపాటు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ పరిశీలించనున్నారు.అనంతరం వర్సిటీ క్యాంపస్‌లో మూడు వేలకుపైగా మొక్కలను నాటే కార్యక్రమాన్ని మంత్రితో ప్రారంభింపజేయ నున్నారు. మంత్రి జిల్లాకు వస్తున్న నేపథ్యంలో వర్సిటీలోని ఉద్యోగులు అంతా అందుబాటులో ఉండాలని, సెలవులు పెట్టవద్దని ఆదేశాలు జారీచేసినట్టు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ధనుంజయ్ తెలిపారు.

ఐటీ అభివృద్ధిపై ఆశలు

... 5వ పేజీ తరువాయి

ఇస్తామని హామీ ఇచ్చారు. ఆ ప్రాజెక్టును తక్షణమే పట్టాలు ఎక్కించాల్సి ఉంది.
● రుషికొండ హిల్ నంబరు 2లో కెనెక్సా కంపెనీ నుంచి వెనక్కి తీసుకున్న 20 ఎకరాల భూమి ఉంది. అందులో ఐటీ టవర్ నిర్మిస్తామని వైసీపీ ప్రభుత్వం ప్రకటించింది. ఎవరూ ముందుకురాలేదు. ఆభూమిని సద్వినియోగం చేయాల్సి ఉంది.

ఐటీ కాన్సెప్ట్ సిటీలు అవసరం

ఐటీని అభివృద్ధి చేయడానికి కాన్సెప్ట్ సిటీలు అవసరం. రుషికొండ, భోగాపురం వీటికి అనువైన ప్రాంతాలు. కాలేజీల నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు ఐటీ రంగానికి ఉపయోగపడేలా మైసూర్‌లో ఇన్ఫోసిస్ నిర్వహిస్తున్న శిక్షణ కేంద్రం లాంటిది ఇక్కడ ఏర్పాటుచేయాలి. ఐటీని ఉత్తేజపరిచేలా కొత్త పాలసీని తీసుకురావాలి. ప్రతి మూడు నెలలసారి ఐటీ పారిశ్రామికవేత్తలతో ప్రభుత్వ ప్రతినిధులు సమావేశాలు నిర్వహించాలి.

- ఓ.నరేశ్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్, రుషికొండ ఐటీ పార్క్

జోరు వాన

... 5వ పేజీ తరువాయి

అల్లిపురం, రైల్వే న్యూకాలనీ, జ్ఞానాపురం ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిలిచిపోయింది. పూర్ణామార్కెట్‌లో కూరగాయలు, సామగ్రి కొనుగోలు చేయడానికి వచ్చిన మహిళలు ఇళ్లకు చేరడానికి ఇబ్బందులు పడ్డారు. గోపాలపట్నం, కాకానినగర్, మధురవాడ, పెందుర్తి, కొమ్మాది ప్రాంతాల్లో గెడ్డలు పొంగాయి. సాయంత్రం నుంచి రాత్రి 11 గంటల వరకు నగరంలోని గంభీరంలో 51, సింహాచలంలో 49.75, కాపులుప్పాడలో 47, భీమిలిలో 46.25, పెందుర్తి బీసీ కాలనీలో 43.25, హెచ్‌బీ కాలనీలో 43 మి.మీ. వర్షపాతం నమోదైంది.

బదిలీల కోసం...

... 5వ పేజీ తరువాయి

, అనకాపల్లి జిల్లాల్లో పనిచేస్తున్న తహసీల్దార్లు పలువురు విశాఖ రావడానికి ఆయా జిల్లా కలెక్టర్లకు దరఖాస్తు చేసుకున్నారు. ఏజెన్సీలో ఉన్న ఉద్యోగులు...ముఖ్యంగా 50 సంవత్సరాల వయస్సు పైబడినవారు మైదానం/నగరంలో పోస్టింగ్ ఇవ్వాలని కోరుతున్నారు. విశాఖ జిల్లాలో రెండు తహసీల్దార్ల పోస్టులు మాత్రమే ఖాళీగా ఉన్నాయి. ఇంకా జిల్లాలో ఒకరిద్దరు తహసీల్దార్లకు బదిలీ ఉంటుందనే ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో పలువురు తహసీల్దార్లు రాజకీయ నాయకుల ద్వారా కలెక్టర్‌కు సిఫారసు చేయించారని తెలిసింది.

చెకింగ్ ఇన్‌స్పెక్టర్ల పోస్టులకు గిరాకీ

నగరంలో పౌర సరఫరాల శాఖలో చెకింగ్ ఇన్‌స్పెక్టర్ల పోస్టులకు గిరాకీ ఏర్పడింది. గ్రామీణ ప్రాంతాల నుంచి నగరంలో చెకింగ్ ఇన్‌స్పెక్టర్లుగా రావాలని ప్రజా ప్రతినిధుల నుంచి పలువురు సిఫారసు లేఖలు సమర్పించారు. నగరంలో పనిచేస్తున్న చెకింగ్ ఇన్‌స్పెక్టర్ ఒకరు 20 మంది డీలర్లను తీసుకుని ఒక ఎమ్మెల్యే వద్దకు వెళ్లి మరీ లేఖ తీసుకున్నారు. ఐదేళ్ల సర్వీస్ దాటినవారు కూడా ఇక్కడే కొనసాగించాలని ఎమ్మెల్యేల నుంచి సిఫారసు లేఖలు తెచ్చుకుంటున్నారు. ఎనిమిది నుంచి పదేళ్లుగా నగరంలో పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్లు కూడా కదలడానికి ససేమిరా అంటున్నారు. పలు వివాదాలతో గ్రామీణ ప్రాంతానికి బదిలీ అయిన ఉద్యోగి ఆనందపురం ఆర్ఐగా రావాలని పైరవీ చేస్తున్నారు. ఒకసారి ఆర్ఐగా పనిచేసిన వ్యక్తిని రెండోసారి అదే పోస్టులో నియమించకూడదు. కానీ నగరం నుంచి బియ్యం ఆనందపురం మీదుగా ఇతర ప్రాంతాలకు వెళుతున్నందున అక్కడ పోస్టింగ్ దక్కితే దండిగా సంపాదించుకోవచ్చునని కూటమి నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. పౌర సరఫరాల శాఖలో తిష్ట వేసినఇన్‌స్పెక్టర్లనుసాగనంపాలని రెవెన్యూ ఉద్యోగులు కోరుతున్నారు.చెకింగ్ ఇన్‌స్పెక్టర్లుగా పనిచేస్తున్నవారిలో పలువురిపై ఆరోపణలు ఉన్నాయి.

3 నెలల్లో ఉక్కును గాడిలో పెడతా

... 5వ పేజీ తరువాయి

తగ్గదన్నారు. గంగవరం పోర్టులో అటాచ్‌మెంట్‌లో ఉన్న కోకింగ్ కోల్‌ను రెండు, మూడు రోజుల్లో విడిపిస్తామన్నారు. కార్మిక సంఘ నాయకులు మాట్లాడుతూ గత మూడేళ్లలో అవినీతి అధికమైందని ఆరోపించారు. కొనుగోలు విభాగంలో అవకతవకలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఫెర్రో అల్లాయిస్, ఫెర్రో మాంగనీస్ తదితరాలను నాణ్యత తక్కువ ఉన్నవి కొని ఎక్కువ మొత్తంలో నిధులు తినేస్తున్నారని, వాటికి చెక్ పెట్టాలని డిమాండ్ చేశారు. ఇటీవల కాలంలో యాజమాన్యం తీసుకున్న చర్యలను అంతా వ్యతిరేకించారు. ఇతర ప్లాంట్లకు ఉద్యోగుల తరలింపు, సీఐఎస్ఎఫ్ సిబ్బందిలో కోత, వీఆర్ఎస్ అమలుకు ప్రణాళిక వంటి అంశాలను నిరసించారు. కాంట్రాక్టు కార్మికులకు నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వలేదని, వెంటనే ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో పర్సనల్ డైరెక్టర్ పాండే, ప్రాజెక్ట్ డైరెక్టర్ అనిల్ కుమార్ బాగ్చి, వివిధ విభాగాల అధిపతులు, కార్మిక సంఘ నాయకులు కేఎస్ఎన్ రావు, మంత్రి రాజశేఖర్, ఎన్.రామచంద్రరావు, వరసాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

1న వినాయక బొమ్మల తయారీపై ఉచిత శిక్షణ

డాబాగార్డెన్స్, ఆగస్టు 28: బాల వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబరు ఒకటో తేదీన వినాయక మట్టి బొమ్మల తయారీపై ఈనెల 1న ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు బీవీఎఫ్ కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. ఫిషింగ్ హార్బర్ సమీపంలోని బాల వికాస్ ఫౌండేషన్ బ్రిడ్జి స్కూల్ ఆవరణలో గ్రీన్‌క్లైమేట్ సహకారంతో ఈ శిక్షణ ఉంటుందన్నారు.వివరాలకు 90324 77463ను సంప్రదించాలని కోరారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు అస్తవ్యస్తం

» సివిల్ జడ్జి వెంకటశేషమ్మ



అవగాహన కల్పిస్తున్న వెంకటశేషమ్మ

కంచరపాలెం, ఆగస్టు 28: మాదక ద్రవ్యాల వినియోగం, ర్యాగింగ్ తదితర అసాంఘిక కార్యకలాపాలపై కఠిన శిక్షలు అమలులో ఉన్నట్టు సీనియర్ జడ్జి శ్రీమతి ఎం. వెంకటశేషమ్మ అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, డ్రగ్స్ తదితర వ్యసనాలకు యువత దూరంగా ఉండాలన్నారు. చక్కని క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకుని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని సూచించారు. చట్టవ్యతిరేక కలాపాలకు పాల్పడితే అమలు చేసే చట్టపరంగా శిక్షలను ఆమె వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.నారాయణరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడాకారిణి జ్యోతికి సత్కారం

అక్కయ్యపాలెం, ఆగస్టు 28: ఒలింపిక్ అథ్లెటిక్ క్రీడాకారిణి యర్రాజీ జ్యోతిని కైలాసపురంలోని తన నివాసానికి ఉత్తర నియోజకవర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు కుమార్తె శ్యామలాదీపిక కుటుంబంతో కలిసి వెళ్లి బుధవారం ఘనంగా సత్కరించారు. రానున్న రోజుల్లో మరిన్ని పతకాలు సాధించి మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు.


సత్కరిస్తున్న శ్యామలా దీపిక

నేత్రదానంపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న నేత్ర వైద్యశాల సిబ్బంది

సీతంపేట, ఆగస్టు 28: జిల్లా అంధత్వ నివారణ సంస్థ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ వి. మీనాక్షి ఆధ్వర్యంలో ద్వారకా బస్ స్టాండ్‌లో ప్రయాణికులకు నేత్ర దానంఅవశ్యకతపై బ్రోచర్‌లు పంపిణీ చేసి అవగాహన కల్పించారు. అలాగే, 9వ జాతీయ నేత్ర దాన పక్షోత్సవాల్లో భాగంగా ఆల్ ఇండియా రేడియోలో ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల కార్నియా కన్సల్టెంట్ డాక్టర్ మోహన ప్రీతి ప్రసంగించారు. రేడియో ప్రతినిధి దిలీప్ సామాన్యులనుంచి వచ్చే అనేక సందేహాలను డాక్టర్‌ని అడిగి శ్రోతలను అర్థమయ్యేలా వివరించారు. ఆసుపత్రి సిబ్బంది నేత్రదానంపై అపోహలను తొలగించేలా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐ డోనేషన్ కౌన్సిలర్లు పూర్ణిమ, సుజాత, ఇతర టీచర్స్ పాల్గొన్నారు.

పోర్టులో సమ్మె నిర్ణయం విరమణ

జగదాంబ కూడలి, ఆగస్టు 28: పోర్టు కార్మికుల దేశవ్యాప్తంగా తలపెట్టిన నిరవధిక సమ్మె విరమించినట్టు అఖిల పక్ష కార్మిక సంఘం నేతలు వెల్లడించారు. బుధవారం విలేకరులతో విశాఖ పోర్టు అఖిల పక్ష కార్మిక సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ... దేశ వ్యాప్తంగా మేజర్ పోర్టులకు సంబంధించిన కార్మికుల సమస్యలపై ఈనెల 28న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను అఖిలపక్ష సంఘాల నిర్ణయం మేరకు విరమించినట్టు చెప్పారు. ఢిల్లీలోని ఐపీఏలో మేజర్ పోర్టులు, డాక్‌వర్కర్స్ ఆరు ఫెడరేషన్ల చైర్మన్లు, బిడబ్ల్యూఎసీఎండీ, ఐపీఏ మధ్య అవగాహన ఒప్పందం కుదిరినట్టు తెలిపారు.

1న మెగా రక్తదాన శిబిరం

సౌత్ ఎమ్మెల్యే, జనసేన పార్టీ నగర అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్

సీతంపేట, ఆగస్టు 28: జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకల్లో భాగంగా సెప్టెంబరు 1వ తేదీన మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తామని విశాఖ సౌత్ ఎమ్మెల్యే, జనసేన పార్టీ నగర అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్ తెలిపారు. స్థానిక పార్టీ నగర కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సెప్టెంబరు 1న ఉదయం 8 నుంచి సీతంపేటలోని పార్టీ కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే, ఆర్కే బీచ్ క్లీనింగ్, అటవీ శాఖ, పోర్టు సహకారంతో ఐదు వేల మొక్కలు నాటుతామన్నారు. కూటమి ప్రభుత్వ పా లనలో ఎయిర్‌పోర్టు రోడ్డు, రైల్వే జోన్, ఫ్లై ఓవర్లు అందుబాటులో వస్తాయన్నారు. ఓటమికి భయపడి పారిపోకుండా నిలబడి పోరాడాలని మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణనుద్దేశించి సవాల్ విసిరారు. ఏయూ మాజీ వీసీ అరాచకాలపై విచారణ కొనసాగుతోందన్నారు. త్వరలో ఆయనకు శిక్ష తప్పదని హెచ్చరించారు. నార్త్ ఇన్‌చార్జి బొలిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ పంచాయతీ రాజ్, పర్యావరణ శాఖలు పవన్ కళ్యాణ్ చూడటం ప్రజల అదృష్టమన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గ ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్, కల్లెపల్లి వెంకట సీతారామరాజు, సూర్యనారాయణ, శివ ప్రసాద్ రెడ్డి, అంగ ప్రశాంతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

కష్టపడి పనిచేసిన వారికి ప్రాధాన్యం

సీతంపేటలోని నగర జనసేన పార్టీ కార్యాలయంలో మహిళా కమిటీలు, జీవీఎంసీ పరిధిలోని అన్ని వార్డుల జనసేన పార్టీ వీర మహిళలతో వంశీకృష్ణ శ్రీనివాస్ ముఖ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ బలోపేతంపై పలు సూచనలు, సలహాలను వీర మహిళలనుంచి అడిగి తెలుసుకున్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. త్వరలో అన్ని కమిటీలతో పాటు సిటీ మహిళా కమిటీలు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.









కమనీయం..అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, ఆగస్టు 28 : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం బుధవారం కమనీయంగా సాగింది. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేసి భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం కల్యాణ క్రతువు జరిపారు.మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

ఘనంగా గంగాదేవి విగ్రహ ప్రతిష్ఠ

భీమునిపట్నం, ఆగస్టు 28 : పట్టణంలోని తోట వీధిలో గంగాదేవి విగ్రహ ప్రతిష్ఠ బుధవారం ఘనంగా జరిగింది.విగ్రహ ప్రతిష్ఠ అనంతరం భక్తులను దర్శనాలకు అనుమతించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అంధ బాలికల పాఠశాల ప్రిన్సిపాల్‌గా నూర్జహాన్

సాగర్‌నగర్, ఆగస్టు 28 : బీచ్ రోడ్డులో ఉన్న అంధ బాలికల ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్‌గా షేక్ నూర్జహాన్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. 16 ఏళ్ల తరువాత పాఠశాలకు మహిళను ప్రిన్సిపాల్‌గా నియమించడంతో బాలికల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యోగి కుటుంబానికి ఆర్థిక సాయం

వెంకోజీపాలెం, ఆగస్టు 28 : ఏయూ ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపస్ కార్యాలయ ఉద్యోగి వి. కేశవరావు ఆకస్మాత్తుగా మృతి చెందడంతో విశాఖ, విజయనగరం, ఉభయ గోదావరి జిల్లాల ప్రోగ్రామ్ అధికారులు ఆయన కుటుంబానికి ఆర్థిక సహాయం చేశారు. సుమారు రూ.3 లక్షల ఆర్థిక సహాయాన్ని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ధనుంజయరావు చేతుల మీదుగా మృతుడి భార్య అనూషకు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో ఏయూ ఎన్‌ఎస్‌ఎస్ పథకం కోఆర్డినేటర్ డాక్టర్ . హరినాథ్, జిల్లా ప్రోగ్రాం అధికారి భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన

భీమునిపట్నం, ఆగస్టు 28 : హెచ్ఐవీపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని స్థానిక సీహెచ్‌సీ ఐసీటీసీ కౌన్సిలర్ వెంకటరాజు చెప్పారు. బుధవారం ఆయన డైట్ కళాశాలలో ఛాత్రోపాధ్యాయులకు హెచ్ఐవీపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో డైట్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మాణిక్యంనాయుడు, సీనియర్ అధ్యాపకులు ఎల్. సుధాకర్, గొట్టేటి రవి, సోమయాజులు, హరిణి, ఎం. మహాలక్ష్మి, ఆర్. నీలిమ, ఎస్. త్రినాథరావు, యువ క్లినిక్ కౌన్సిలర్ సత్య, కమ్యూనిటీ ఆర్గనైజర్ మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రార్‌కు అభినందనలు

వెంకోజీపాలెం, ఆగస్టు 28 : ఏయూ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన ఆచార్య ధనుంజయరావును విదేశీ విద్యార్థులు బుధవారం అభినందించారు. గతంలో అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల డీన్‌గా సేవలందించిన ధనుంజయరావు రిజిస్ట్రార్‌గా పదోన్నతి పొందడంతో పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆదికవి నన్నయ్య వర్సిటీ మాజీ వీసీ ఆచార్య జగన్నాథరావు, పలువురు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆశీల వసూలు వేలం వాయిదా

భీమునిపట్నం, ఆగస్టు 28 : పట్టణంలోని జోనల్ కార్యాలయంలో గురువారం జరగాల్సిన మునిసిపల్ దుకాణాలు, మార్కెట్ ఆశీల వసూలు వేలం పాటలను అనివార్య కారణాల వల్ల ఈనెల 30వ తేదీకి వాయిదా వేసినట్టు జడ్సీ కనకమహాలక్ష్మి తెలిపారు. ఈమేరకు బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

వెంకోజీపాలెం, ఆగస్టు 28 : ఏయూ ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో మొక్కలు నాటే ప్రాంతాన్ని వీసీ ఆచార్య జి. శశిభూషణరావు బుధవారం పరిశీలించారు. మొక్కలు నాటే ప్రాంగణం, చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు, మొక్కలకు అవసరమైన నీరు అందించే నీటి సరఫరా వ్యవస్థ గురించి ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

పద్మనాభం, ఆగస్టు 28 : పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించడానికి మూడు కౌంటర్లు ఏర్పాటు చేయాలని పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ కె. విజయ భాస్కర్ కోరారు. బుధవారం ఆయన రేవిడి ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు.

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 11 లో..



చేపల దిబ్బడిపాలెం వద్ద రహదారికి అడ్డంగా కూలిన చెట్టు

భీమిలిలో ఈదురుగాలులతో వర్షం

భీమునిపట్నం, ఆగస్టు 28 : పట్టణంలో బుధవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. బీచ్‌రోడ్‌లో చేపలుప్పాడ సమీపంలోని కొత్తూరు - చేపలదిబ్బడిపాలెం రహదారిలో పెద్ద చెట్టు కూలిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. అధికారులకు ఫిర్యాదు చేసినా.. స్పందించకపోవడంతో చేపలదిబ్బడిపాలెంలో ఉన్న ఐటీడీపీ 4 వార్డు అధ్యక్షుడు కర్రి చిన్న, ఆ వార్డు టీఎన్‌ఎస్‌ఎఫ్ అధ్యక్షుడు సూరాడ రవి, కొత్తూరు గ్రామస్థులు చెట్టు కొమ్మలను తొలగించి, రాకపోకలను పునరుద్ధరించారు. అలాగే రామాద్రి బీచ్ వద్ద చెట్టు రోడ్డుకి ఒకవైపు ఒరిగిపోయింది. తిమ్మాపురం జంక్షన్ సమీపంలో వున్న వైజాగ్ ఫిల్మ్‌నగర్ కల్చరల్ సెంటర్ వద్ద కూడా చెట్టు కూలిపోయింది. పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

హెచ్‌బీ కాలనీ రహదారిలో నిలిచిన వర్షం నీరు

వెంకోజీపాలెం/ఆరిలోవ : హెచ్‌బీ కాలనీ బస్టాప్ వద్ద పెద్ద ఎత్తున నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. అదే సమయంలో ఈ మార్గంలో చెట్టు కొమ్మ విరిగిపడడం, ఒక కారు రోడ్డు మధ్యలో ఆగిపోవడంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. అభివృద్ధి పనుల పేరిట పెద్ద పెద్ద కాలువలు నిర్మించి, వాటిపై ఫుట్‌పాత్‌లు ఏర్పాటు చేసిన అధికారులు వర్షం నీరు కాలువల్లోకి వెళ్లేందుకు దారి కల్పించలేదు. దీంతో సీతమ్మధార నుంచి హెచ్‌బీ కాలనీ వరకు రోడ్డుపై నీరు వరదలా పారుతుంది. ఆరిలోవలోని పలు ప్రాంతాల్లోనూ వర్షం పడింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.



హెచ్‌బీ కాలనీ ప్రధాన రహదారిలో చేరిన నీరు

ఏయూకు పూర్వ వైభవం తీసుకురావాలని వినతి



ఎంపీ శ్రీభరత్‌తో సమితి సభ్యులు

వెంకోజీపాలెం, ఆగస్టు 28 : ఏయూకు పూర్వ వైభవం తీసుకురావాలని ఎంపీ శ్రీభరత్‌ను ఏయూ పరిరక్షణ సమితి సభ్యులు కోరారు. బుధవారం వారు ఎంవీపీ కాలనీలో ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఆయన్ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమితి సభ్యులు మాట్లాడుతూ వర్సిటీలో నోటిఫికేషన్ లేకుండా నియమించిన ఎయిడెడ్ ఫ్యాకల్టీని, అడ్జస్ట్మెంట్ ఫ్యాకల్టీని తొలగించాలన్నారు. అలాగే ఏయూలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించాలన్నారు. కార్యక్రమంలో సమితి సభ్యులు డాక్టర్ ఎం. సురేష్ మీనన్, డాక్టర్ శ్రీను, డాక్టర్ దాస్, డాక్టర్ సూరి పాల్గొన్నారు.

విద్యా రంగంలో ఉన్నతంగా ఏయూ

వెంకోజీపాలెం, ఆగస్టు 28 : విద్యా రంగంలో ఏయూ శిఖరాగ్రాన నిలుస్తోందని రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్. ధనుంజయరావు అన్నారు. బుధవారం ఆయన ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్‌లో నూతన విద్యా సంవత్సరం బీబీఏ-ఎంబీఏ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏయూ శతాబ్ది ఉత్సవాలు జరుపుకోవడానికి సిద్ధమవుతుందన్నారు.ఈమేరకు వర్సిటీని ఎంపిక చేసుకున్న విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆచార్య పి. విశ్వనాథం, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు వృత్తి విద్యా శిక్షణ అవసరం

భీమునిపట్నం, ఆగస్టు 28 : మహిళల ఆర్థికాభివృద్ధికి వృత్తి విద్యా శిక్షణ అవసరమని స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ మురళీకృష్ణ అన్నారు. బుధవారం ఆ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజనలో భాగంగా వృత్తి విద్యా శిక్షణ పొందిన విద్యార్థినులకు ఆయన సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికి ఉపాధి శిక్షణలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఎన్. గౌరి, శిక్షణ కోఆర్డినేటర్ అన్నపూర్ణ, ముంతాజ్ పాల్గొన్నారు.

రోడ్ల విస్తరణకు సహకరించండి

ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



వర్తకులు, గృహ యజమానులతో సమావేశమైన ఎమ్మెల్యే శ్రీనివాసరావు

భీమునిపట్నం, ఆగస్టు 28 : పట్టణంలో ప్రధాన రహదారుల విస్తరణకు ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కోరారు. బుధవారం ఆయన బీచ్ రోడ్‌లోని టీడీపీ కార్యాలయంలో వర్తకులు, గృహ యజమానులు, కూటమి నాయకులతో వేర్వేరుగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్ల విస్తరణతో పట్టణం అభివృద్ధి చెందుతుందన్నారు. విస్తరణ పనుల వల్ల తాత్కాలిక ఇబ్బందులు కలిగినా.. భవిష్యత్‌లో అనేక ప్రయోజనాలు కలుగుతాయని చెప్పారు. గంట స్తంభం ప్రధాన రహదారి, లక్ష్మీనృశింహస్వామి కొండ రోడ్, బీచ్‌రోడ్ విస్తరించాల్సి ఉందని తెలిపారు.అలాగే పట్టణంలో ప్రధానమైన ఈ మూడు రహదారుల ప్రస్తుత వెడల్పు, ప్రతిపాదిత విస్తరణతో ఎంత మేర ఎన్నెన్ని నిర్మాణాలు తొలగించాల్సి ఉందన్న వివరాలను వారం రోజుల్లో నివేదిక రూపొందించాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. బాధితులకు అందించాల్సిన నష్టపరిహారంపై పూర్తి భరోసా వచ్చిన తరువాతే పనులు మొదలు పెడతామని చెప్పారు. జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి మాట్లాడుతూ మూడు రహదారుల విస్తరణపై వచ్చే నెల 4వ తేదీ నాటికి నివేదిక అందజేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు చిక్కాల విజయ్‌బాబు, గాడు అప్పలనాయుడు, గంటా నూకరాజు, గొలగాని నరేంద్రకుమార్, బీజేపీ నాయకులు కంటుభుక్త రామానాయుడు, సునీత, విజయ పాల్గొన్నారు.

మున్సిపల్ ఉపాధ్యాయుల నిరసన

తగరపువలస, ఆగస్టు 28 : మున్సిపల్ పాఠశాలలకు విఘాతం కలిగించే 84, 117 జీవోలను రద్దు చేయాలని మున్సిపల్ ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. బుధవారం వారు మున్సిపల్ టీచర్ల ఫెడరేషన్ ఆధ్వర్యంలో చిట్టివలసలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 84, 117 జీవోల వల్ల ఉపాధ్యాయుల పదోన్నతులకు ఇబ్బందులు వస్తాయని, పాఠశాలలు మూసివేసే పరిస్థితులు తలెత్తుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో చిట్టివలస అంబేడ్కర్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు, విల్సన్‌పేట, సంగివలస పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.















వైసీపీ భూ దందాపై విచారణ జరపాలి : బీవీ రామ్

భీమునిపట్నం, ఆగస్టు 28 : విశాఖ పరిపాలనా రాజధాని పేరుతో వైసీపీ నాయకులు భీమిలిలో జరిపిన భూదందాపై ప్రభుత్వం విచారణ జరపాలని తెలుగు శక్తి అధ్యక్షుడు బీవీ రామ్ కోరారు. బుధవారం ఆయన పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జిగా వ్యవహరించిన వైవీ సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డి నేతృత్వంలో నాయకులు దౌర్జన్యంగా భూ దందాలకు పాల్పడ్డారని ఆరోపించారు.శారదా పీఠానికి కొత్తవలసలో కేటాయించిన 15 ఎకరాలను వెనక్కి తీసుకోవాలన్నారు. ఏయూలో నెలకొల్పిన వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని తొలగించాలని, మాజీ వీసీ ప్రసాదరెడ్డి అరాచకాలపై విచారణ జరిపి ఆయన్ను అరెస్టు చేయాలన్నారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, నాయకులు మారోజు సంజీవ్‌కుమార్, డాక్టర్ పప్పూర్ నికుంజ్, పోలిరాజు, కొక్కిరి అప్పన్న, రమణ, శంకర్, వంశీ, సంజీవరావు, సత్యారావు, యానాపు శ్రీనివాసరావు, దాసరి కొండబాబు పాల్గొన్నారు.

నల్లనయ్యకు కమిషనర్ అభినందనలు



నల్లనయ్య రచించిన గేయాల సీడీని ఆవిష్కరిస్తున్న కమిషనర్ సంపత్‌కుమార్

వెంకోజీపాలెం,ఆగస్టు 28 : జీవీఎంసీ కార్యదర్శి పల్లి నల్లనయ్య నచించిన గేయాలు, రచనలు నగర ప్రజల అవగాహనకు, జీవీఎంసీ శ్రేయస్సుకు దోహదపడ్డాయని కమిషనర్ సంపత్‌కుమార్ అన్నారు. ఇటీవల విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బదిలీ అయిన పల్లి నల్లనయ్యను కమిషనర్ బుధవారం తన కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా నల్లనయ్య జీవీఎంసీ ఇతివృత్తంపై రచించిన పది గేయాలను నగరానికి చెందిన శ్రీమాత స్టూడియోస్ అధినేతలు, భిన్నాల నరసింహమూర్తి, పల్లి నాగభూషణరావు నిర్మించి తయారు చేసిన సీడీని కమిషనర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నల్లనయ్య రచించిన పాటలు జీవీఎంసీ శ్రేయస్సుకు, ప్రజా అవగాహనకు ఉపయోగపడాయని చెప్పారు.

